ఆదివారం
ప్రజాశక్తి
జూన్ 8, 2003

'కొన'గలిగితేనే చదువు?



హ్యాపీ బర్త్‌డే

(8-6-2003నుండి14-6-2003వరకు)

భవాని
2సం॥, జూన్-2001
లక్ష్మి-వేణు
[illegible] సెంటర్-విజయవాడ

ఎం.విహారిక నివాస్
1సం॥, 11.6.2002
భాగ్యలక్ష్మి-శ్రీనివాస్
ఓల్డ్ మలక్‌పేట్-హైదరాబాద్

సాయిచంద్రిక
2సం॥, జూన్-2001
భూలక్ష్మి-కొండ
రావినూతల-ఖమ్మం

జి.శ్రామణ సంధ్య
లలితమ్మ-సోమశేఖర్
సోమందేపల్లి-అనంతపురం

యశస్వి
3సం॥, జూన్, 2000
అనసూయ-మహేష్‌రెడ్డి
కరకంబాడి-చిత్తూరు

సమీక్ష
1సం॥, జూన్-2002
వందన-చంద్రశేఖర్
న్యూమెట్టుగూడ-సికింద్రాబాద్

సయ్యద్ ముషరఫ్
1సం॥, జూన్-2002
శాహెదాబేగం-సయ్యద్ ఖాజా
దోర్నకల్-వరంగల్

ఎం. గోపీనాథ్ గౌడ్
4సం॥, జూన్-1999
అరుణ-మంగయ్యగౌడ్
మునగాల-నల్లగొండ

జి.లావణ్య
10.జూన్
వెంకటలక్ష్మి- చంద్రశేఖర్
వాయుడుతోట-విశాఖపట్నం

డి. పి.ఎస్. అభిలాష్
6సం॥, 11.6.2000
లక్ష్మి-రాధాకృష్ణ
కొవ్వూరు- ప॥గో

జి.వెనిలా
2సం॥ 12.6. 2001
మాధవి-రాము
కోడూరు-కృష్ణ

జుబేర్ అహ్మద్
4సం॥, జూన్, 1999
జరీన సుల్తాన-అబ్దుల్ అజీజ్
మోమిన్‌పేట్-రంగారెడ్డి

కె.శ్రావణి
అనసూయ-నర్సింలు
కడుమూర్-రంగారెడ్డి

జి.స్వాతి
2సం, 13.6.2001
వరలక్ష్మి-నారాయణరావు
దేవరాపల్లి-విశాఖ

పి.సాయిదీపక్
2సం॥, 14.6.2001
ఆశాజ్యోతి-బాబూరావు
టీచర్స్ కాలనీ-శ్రీకాకుళం

ఆకాంక్ష
1సం, జూన్-2002
పార్వతి-సురేష్‌యాదవ్
న్యూబోయిగూడ-
సికింద్రాబాద్

ఎం. ప్రసన్నరాణి
ఎం.కొండల్(మహేందర్)
పోలేపల్లి- మహబూబ్‌నగర్

మనలో మాట

రిటైర్

నేతిబీరకాయలో నెయ్యి ఎప్పుడూ ఉండదు. అయినా దాని పేరు మారదు. పంజాగుట్టలో గుట్టకోసం వెతికితే టైమ్ వేస్ట్ తప్ప ఫలితం ఉండదు. అటల్ బిహారీలో అటలత (స్థిరత్వం) కోసం వెతకడమూ అలాంటిదే. స్థిరత్వం అలా ఉంచి ఇప్పుడు ఆయన మాటలకు అర్థం కనుక్కోవడమే బ్రహ్మప్రళయం అయిపోయింది. చెప్పేవాడికి వినేవాడు లోకువ. ఈ టెక్నిక్‌ను ఆయన అవపోసన పట్టినట్లున్నారు. చెప్పేవాడు ఏదైనా చెప్పొచ్చు, ఆ తత్వం బోధపడక వినేవాడు గింగుర్లు తిరగాల్సిందే. చాలామంది రాజకీయ నేతల అంతరంగం కనిపెట్టడం కష్టం. ఆ నేత కవికూడా అయితే మరీ కష్టం. మన ప్రధానిగారు కవిగారు కూడా. 'ఆకాశానికి అంతుంది' అని కవి అంటే అంతెక్కడుందో అన్వేషించాల్సిందే తప్ప కాస్త చూపెడుదురూ అని అడగటానికి వీల్లేదు. వాజ్‌పేయిగారు కూడా అలా అప్పుడప్పుడు కొన్ని మాటలు గాలిలోకి వదుల్తుంటారు. వాటి అర్థం తెలియక మొదట జర్నలిస్టులు, ఆ తర్వాత ఎన్డీఏ నేతలు, ఆనక సాధారణ జనం తికమక పడ్తారు. ఎవరికి కావాల్సిన అన్వయం వారు చెప్పుకొంటారు. అటల్జీ అసలు విషయం చెప్పరు. చిర్నవ్వులు ఒలక బోస్తుంటారు.

ఈ మధ్య ఆయన 'రిటైర్' అన్న పదంపై మచ్చట పెంచుకొన్నారు. నానార్థాల పదం అది. కనుకే వెతికి పట్టుకొన్నట్లుంది. పాక్‌తో చర్చలు ఫలప్రదం కాకపోతే 'రిటైర్' అవుతానని బెర్లిన్‌లో ప్రకటించారు. కూల్చేసిన బెర్లిన్ గోడ దగ్గరికి వెళ్లి జర్మన్ల పారదర్శక దృష్టిని ప్రశంసించారు. తాము మాత్రం బెర్లిన్ గోడ కంటే దుర్భేద్యమైన పదాన్ని ప్రయోగించారు. రిటైర్ అంటే ఉపసంహరణ కావచ్చు. పదవీ విరమణ కావచ్చు. ఆ రెంటిలో ఆయన చెప్పదల్చుకొందేదో వివరించలేదు. ఇకనేం ఢిల్లీ నేతలు తలో వ్యాఖ్యానం చెప్పేరు. ఈలోగా బెర్లిన్ నుండి నానా దేశాలు తిరిగి వాజ్‌పేయి ఢిల్లీ చేరారు. రాగానే రిటైర్‌కు తోడు టైర్డ్ అనే మరో మాట జోడించారు. న టైర్డ్, న రిటైర్డ్ – అలసిపోలేదు, రిటైర్ కావడం లేదు అంటూ మరింత గందరగోళంలో పడేశారు. అద్వానీ నాయకత్వంతో ముందుకు సాగుదాం అంటూ పిలుపిచ్చారు. అదివిన్న బి.జె.పి. నేతలకు చెమటలు పట్టేశాయి. ఏమనుకున్నారో కాని అద్వానీ మౌనం వహించారు. కాని పార్టీ అధ్యక్షుడు మొదలెట్టి అమాత్యుల వరకు ఆత్రంగా అన్వయాలు చెప్పారు.

తృణమూల్ నేతలు వెంటనే రంగంలోకి దిగారు. వాజ్‌పేయి లేని ఎన్డీఏను ఊహించుకోలేమని బి.జె.పి. మార్కు సెక్యులరిస్టు పట్ల 'నిబద్ధత'ను వెల్లడించారు. వారి నిబద్ధతలకు కొలబద్దలు వేరే ఉంటాయి. బెంగాలీలు అవేమిటో గ్రహిస్తూనే ఉన్నారు. అవకాశం దొరికితే వాతలు అనుగ్రహిస్తూనే ఉన్నారు. దక్షిణాదిలోనూ ఈ నిబద్ధతలకు కరువు లేదు. కరుణానిధి గారు ఈ మధ్య తన పార్టీ మహాసభ జరిపారు. మహాసభ తర్వాత బి.జె.పి.తో పొత్తుపై ఆయన ఏం చెప్తారోనని జనం ఎదురు చూశారు. బి.జె.పి.తో పొత్తు కొనసాగుతుందా? అని విలేకరులు ప్రశ్నించగా పొత్తు ఉండాలనీ లేదు, ఉండకూడదనీ లేదు అంటూ సెలవిచ్చారు. అయినా నా పొత్తు ఎన్డీఏతోగానీ బి.జె.పి.తో కాదు అంటూ 'జ్ఞానబోధ' చేశారు. ఎన్డీఏలో బి.జె.పి. పాత్ర ఏమిటో కరుణానిధికి తెలియదని లోకం నమ్మాలన్నమాట. అది కలైజ్ఞర్ చాతుర్యం. ఆయన కవి కాదు. అయితేనేం డైలాగ్ రైటర్ కదా! సీను మారితే సంభాషణలు మార్చేస్తారు.

ఇక మన ముఖ్యమంత్రి ఉన్నారు. 'నిబద్ధత'లో రెండాకులు ఎక్కువే చదివారు. ఆయన ఎన్డీఏకు కట్టుబడి లేరట. ఎన్డీఏ ఎజెండాకు కట్టుబడి ఉన్నారట. ముస్లింలను ఊచకోత కోస్తున్నారు బాబూ అంటే అలా చేయాలని ఎన్డీఏ ఎజెండాలో ఎక్కడుందో చూపెట్టమని ప్రశ్నిస్తారు. అలాంటి మాట ఎజెండాలో ఉన్నట్లు చూపెడితే మరుక్షణమే దోస్తీ కట్ అంటారు. వివాదాస్పద స్థలంలోనే రామజన్మభూమి ఉందంటూ కోర్టులో ప్రభుత్వం వాదించినా ఆయన పట్టించుకోరు. ఎందుకంటే ఆ మాట ఎన్డీఏ ఎజెండాలో లేదు కాబట్టి. నేతి బీరకాయలో నెయ్యి ఉండకపోతే ఆ పేరు ఎలా వచ్చిందని వాదిస్తారు. నేతి బీరకాయపట్ల బల్లగుద్ది నిబద్ధత ప్రకటిస్తారు. ◆

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
కవర్‌స్టోరీ . . . 3
ఆరోగ్యం . . . 6
జీవనశైలి . . . 8
గేయలహరి . . . 9
బాలల కథ . . . 11
వాడేస్తారా . . . 12
కవనం . . . 14
టూర్‌గైడ్ . . . 16
క్రీడారంగం . . . 17
పుస్తక పరిచయం . . . 20
కళాసాహితి . . . 21
పలుకుబడి 24
వగైరా . . . .

ఇంకా...

పిల్లల మనోవికాసం - తల్లిదండ్రుల పాత్ర
బాలవికాసం . . 10

ప్రోత్సాహం కావాలి
'ఇంతి' సంగతులు . . . 15



జీవకారుణ్యారణ్యం
కథ . . . 18, 19

అంగవైకల్యం అడ్డుకాదు
రియల్‌స్టోరీ
. . .22, 23


ఎవరి
సంప్రదాయ..
వాళ్లకు..
ముద్దు సార్!!
సంప్రదాయ డ్రెస్సులతో
నే తిరుపతి
దర్శనం -
కొత్త ప్రతిపాదన
Dhar..


మందు తాగడం..
నేనెప్పుడో
మానేశా!!
ఆయిల్
Dhar..


డిసీజ్ మై
ఛాలెంజ్
జాతీయ భాషగా
తెలుగుకు గుర్తింపు
తెస్తా - బాబు
Dhar..

చదువుకొనే బాలలు

చదువు'కొనే' బాలలు

'కొన'గలిగితేనే చదువు?

* ఇ.వి. బాలాజీ

విద్యాదానం అన్ని దానాల కంటే గొప్పదని ఒకనాటి సూక్తి. విద్యా వ్యాపారం అన్ని వ్యాపారాల్లో కెల్లా లాభకరమైనది అనేది నేటి నానుడి. ప్రపంచీకరణ నేపథ్యంలో విద్య కూడా ఒక వ్యాపార వస్తువుగా మారిపోయింది. ఎంత డబ్బు ఉంటే అంత 'గొప్ప' చదువు అనే పరిస్థితి వచ్చింది. రేపటి పౌరులను ఉన్నతులుగా తీర్చి దిద్దాల్సిన ప్రభుత్వం వారిని వ్యాపారసంస్థల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. రాను రాను పేదలకు సంతకం పెట్టే చదువు వస్తే చాలుననే పరిస్థితి తీసుకువస్తోంది. ఉన్నతవిద్యను ధనికులకే పరిమితం చేస్తోంది. ప్రధాన సామాజిక బాధ్యతల నుండి ప్రభుత్వాలు వైదొలగడం మొదలైనప్పటి నుండి విద్యావ్యాపారం రాష్ట్రంలో పుంజుకుంది. నిన్న మొన్నటి వరకు రాష్ట్రంలోని విద్యావేత్తలే ప్రయివేటు స్కూళ్ళు, కాలేజీలు స్థాపించేవారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన పుణ్యాన విదేశీసంస్థలు మన విద్యారంగంలో చొరబడ్డాయి. ట్రిపుల్ ఐటి, బిజినెస్ స్కూల్‌తో మొదలైన విదేశీసంస్థల, పారిశ్రామిక సంస్థల ప్రవేశం ఇపుడు అంతర్జాతీయ స్కూళ్ళు స్థాపించే స్థాయికి చేరింది. చైన్ సూపర్‌మార్కెట్ల మాదిరిగా చైన్ స్కూళ్ళు ఏర్పాటవుతున్నాయి. ఢిల్లీలో పబ్లిక్‌స్కూల్ పెట్టిన ఒక సంస్థ గల్లీ వరకూ విస్తరించడానికి భారీ పథక రచన చేస్తోంది. అమెరికా స్కూల్స్ సంస్థ ఏకంగా ముఖ్యమంత్రికి ప్రీతిపాత్రమైన సైబరాబాద్‌లో అమెరికా స్కూల్‌నే ఏర్పాటు చేసింది. కేవలం అమెరికా వెళ్ళి ఉన్నత విద్య అభ్యసించగలవారే అందులో చేరాలి. ఎందుకంటే అక్కడ బోధించేదంతా అమెరికా సిలబస్ మాత్రమే. తాజాగా రాష్ట్రంలో ప్రయివేటు యూనివర్శిటీలకు కూడా అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు అనేక విదేశీ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయని వార్తలు వెలువడ్డాయి. ఇదే జరిగితే యూనివర్శిటీ విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా మిగలక తప్పదు.

దేశంలో ప్రత్యేకించి రాష్ట్రంలో పెరిగిపోతున్న సామాజిక అంతరాలకు పబ్లిక్ స్కూళ్ళలోనే బీజాలు పడుతున్నాయి. పల్లెల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు., ప్రపంచబ్యాంక్ నిధులతో కట్టిన ఏడాదికే బీటలువారే గోడలు., ఒక్క వర్షానికే కారిపోయే పైకప్పులు., రెండు క్లాసులకు ఒక్కరే టీచర్., టీచర్ కూర్చోవడానికి కుర్చీ, బల్ల లేని దుస్థితి., పిల్లలకు పాఠాలు చెప్పేటపుడు నల్లబల్లపై రాయడానికి చాక్‌పీస్‌లు కొనివ్వలేని దుర్గతి., బాలలు తాగడానికి మంచినీళ్ళు., మరుగుదొడ్లు కట్టించలేని 'దీనస్థితి'లోనూ మన ప్రభుత్వం ఉంది. మానసిక, శారీరక వికలాంగుల కోసం నిర్వహించే హాస్టళ్ళలో ఉండే బాలలకు కనీసం రక్షణ కూడా కల్పించలేని అసమర్థ స్థితిలో ఈ ప్రభుత్వం ఉందనేందుకు ఇటీవల హైటెక్ రాజధానిలోని బధిరుల పాఠశాలలో బాలికలపై పోకిరీల వేధింపులే సాక్ష్యం. సామాన్యుడి బిడ్డలకు మంచి చదువు చెప్పించలేని ఈ ప్రభుత్వం రాజధానిలో ట్రిపుల్ ఐటికి, బిజినెస్ స్కూల్‌కు కోట్ల రూపాయల విలువైన వందల ఎకరాల భూమి విరాళంగా ఇవ్వగలదు. పెద్ద కంపెనీలకు అవసరమయ్యే కంప్యూటర్ ఇంజనీర్లు, బిజినెస్ మేనేజర్లను తయారు చేయడానికి పూర్తిగా సహాయం చేయగలదు. రాష్ట్ర రాజధానిలో, జిల్లా కేంద్రాల్లో, అనేక పట్టణ శివార్లలో విశాలమైన ప్రాంగణాల్లో వెలిసే అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి స్కూళ్ళకు ఇతోధిక సాయం చేయగలదీ ప్రభుత్వం. పబ్లిక్‌స్కూళ్ళలో ఐదవ తరగతి చదివే

విద్యార్థికి, పల్లెటూర్లో పదో తరగతి చదివే విద్యార్థికి పోటీ పెడితే ఐదో తరగతి విద్యార్థే నెగ్గుతాడు. ఇది మన చదువుల దుస్థితి. అయినా ఆ మట్టి నుండే ఎందరో మాణిక్యాలు తయారవుతున్నారు. అది వేరే సంగతి.

1990వ దశకం ప్రారంభం నుండే రాష్ట్రంలో విద్యారంగం అనేక మార్పులకు గురయింది. ప్రయివేటు రంగంలో రెసిడెన్షియల్ బోధన ప్రారంభమైంది. ప్రస్తుతం అది తారాస్థాయికి చేరింది. ఎంతవరకు వచ్చిందంటే ఎనిమిదవ తరగతి నుండే ఐఐటికి ఫౌండేషన్ కోర్సులు చెబుతున్నారు. ఇంటర్‌మీడియట్‌లోకి అడుగుపెట్టేవారు ఐఐటికో, బిట్స్‌కో వెళ్ళాలన్నా, రాష్ట్రంలో ఇంజనీర్ కావాలన్నా లేక డాక్టర్ కావాలన్నా సీట్ గ్యారెంటీ కోచింగ్‌లు ఇస్తున్నారు. ఇక ఆ విద్యార్థికి సూర్యుడు, చంద్రుడు, ఆకాశం, ఉదయం, సాయంత్రం ఎలా ఉంటాయో తెలిసే అవకాశం లేదు. అపుడపుడు కనిపించే అమ్మానాన్నా, అక్కా తమ్ముడు వంటి రక్త సంబంధీకులు మినహా ఇతర బంధువులు, స్కూల్‌లో తనతో చదువుకున్న స్నేహితులతో అసలు సంబంధం ఉండదు. మొత్తంగా కాబోయే ఇంజనీర్ లేదా డాక్టర్‌కు సమాజంతో సంబంధం తెగిపోతుంది. వేకువజామున నిద్ర లేచింది మొదలు మరలా అర్ధరాత్రి నిద్రపోయేవరకు చదువే చదువు. ఇటువంటి వారే ఉన్నత స్థానాలకు ఎగబాకి ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని 'తీర్చిదిద్దుతారు'. ఈనాటి చదువుల్లో వేగం పెరిగింది, పోటీ పెరిగింది. తమ పిల్లలు గొప్పవారు కావాలని ప్రతి తల్లిదండ్రులకూ ఉంటుంది. అలా ఆలోచించకపోతే వారు బాధ్యత గల తల్లిదండ్రులు కారు. వేగం, ఖర్చు పెరిగిన ఈనాటి చదువులు చెప్పించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఒక దశాబ్దం కిందట పదవతరగతి ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణుడైతే చాలా తెలివైనవాడు. మరి ఇపుడో 98 శాతం మార్కులు వస్తేనే గొప్ప. విద్యార్థుల మధ్య పోటీ పెరిగింది. ఒత్తిడి పెరిగింది. పోటీపడి చదువుతున్నారు. గతంలో మొదటి శ్రేణి తక్కువగా, తృతీయ శ్రేణి ఎక్కువగా ఉండేవారు. ప్రస్తుతం అత్యధికంగా మొదటి శ్రేణిలోనే పాసవుతున్నారు. తృతీయ శ్రేణి చాలా తక్కువగా ఉంటున్నారు. టెన్త్‌క్లాస్‌లో పాస్ శాతం కూడా క్రమేణా పెరుగుతోంది.

ప్రయివేటు స్కూళ్ళు విపరీతంగా పెరిగిపోవడం, వాటి మధ్య పోటీ టెన్త్ ఫలితాల దిశనే మార్చివేశాయి. వీటితో ప్రభుత్వ పాఠశాలలు కూడా ఎంతోకొంత పోటీపడక తప్పడంలేదు. ఈ పోటీ నడుమ విద్యాప్రమాణాలు పతనం అవుతున్నాయని, మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని, అందుకే ఫలితాలు పెరుగుతున్నాయనే ఆరోపణ కూడా వినిపిస్తున్నది. టెన్త్‌లో అగ్రస్థానంలో ఉన్న జిల్లాలు ఇంటర్‌లో అట్టడుగుకు వెళ్ళడం, ఇంటర్‌లో ప్రథమ స్థానంలో ఉన్న జిల్లాలు పదవ తరగతిలో చిట్ట చివరన ఉండటం వంటి అంశాలు మాస్ కాపీయింగ్ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. జీరో ఫలితాలు సాధించే ప్రభుత్వ పాఠశాలలు కూడా క్రమంగా తగ్గుతున్నాయి. ప్రభుత్వం నిర్వహించే గురుకుల పాఠశాలలు కూడా ప్రయివేటు

గత మూడేళ్ళుగా నూరు శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు			
పాఠశాలలు	2001	2002	2003
ప్రభుత్వ	16	18	44
జిల్లాపరిషత్	50	100	239
మున్సిపల్	00	00	07
రెసిడెన్షియల్	14	39	34
ప్రయివేటు	223	357	580
మొత్తం	303	514	904

విద్యాసంస్థలతో పోటీపడి మంచిఫలితాలు ఇస్తున్నాయి.

పోటీపడలేకపోతున్న ప్రభుత్వ విద్యాసంస్థలు

ఈ పోటీ ప్రపంచంలో విద్యారంగం యావత్తూ పోటీమయమైపోయింది. కొన్ని ప్రయివేటు విద్యాసంస్థలు పాటిస్తున్న విద్యాప్రమాణాలతో ప్రభుత్వ విద్య పోటీపడలేకపోతోంది. సౌకర్యాలు లేని పాఠశాలలు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాల నుండి వచ్చే పిల్లలకే ప్రభుత్వ పాఠశాలలు అనేవిధంగా తయారైంది. పాఠశాల విద్యకు ఏటా నాలుగు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆ సొమ్ము సద్వినియోగం చేయడం గురించి ఆలోచించడంలేదు. ప్రపంచబ్యాంక్ నుండి నిధులు తెచ్చి అమలుచేస్తున్న ప్రాథమిక విద్యాపథకంలో నిధులు ఎంత దుర్వినియోగమవుతున్నా పట్టించుకోవడంలేదు. పాఠశాలల్లో పిల్లలకు పాఠాలు చెప్పవలసిన ఉపాధ్యాయులను జనాభా లెక్కల సేకరణకు, జంతువుల లెక్కలకు, అన్ని రకాల సర్వేలకు ఉపయోగించుకుంటోంది. దీంతో అటు ఉపాధ్యాయులకు ఇటు విద్యార్థులకు విద్యపై ఏకాగ్రత లోపిస్తోంది. ఇంతటి అసౌకర్యాల నడుమ కూడా ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఫలితాలనే సాధిస్తున్నాయి. చదువుకోవడానికి అనువైన పరిస్థితులు, కొన్ని సౌకర్యాలు ఉంటే ప్రయివేటు కార్పొరేట్ స్కూళ్ళతో పోటీపడగలమని గురుకుల పాఠశాలల విద్యార్థులు నిరూపిస్తున్నారు. గురుకుల పాఠశాలలపై పెడుతున్న శ్రద్ధను కూడా మామూలు పాఠశాలలపై ప్రభుత్వం పెట్టడంలేదు.

పదవతరగతిలో జిల్లాల పరిస్థితి	
వరంగల్ జిల్లాది అగ్రస్థానం	89.74 శాతం
హైదరాబాద్‌ది అథమ స్థానం	61.59 శాతం
మహబూబ్‌నగర్ ఫలితాలు	80.53 శాతం
కృష్ణా జిల్లా కూడా వెనుకే	69.26 శాతం

ఇంటర్‌లో జిల్లాల పరిస్థితి	
కృష్ణా అగ్రభాగాన నిలబడింది	63.38 శాతం
చిట్టచివరన మహబూబ్‌నగర్	28.2 శాతం
నాలుగో స్థానంలో హైదరాబాద్	54.91 శాతం
వరంగల్ 21వ స్థానానికి చేరింది	34.75 శాతం

మరో వైపున నర్సరీకి ఏడాదికి 15 వేల నుండి లక్ష రూపాయల వరకు చెల్లించి అంతర్జాతీయ స్కూళ్ళలో సకల సౌకర్యాల నడుమ చదువుకునే ధనవంతుల బిడ్డలు అన్నిరంగాల్లోనూ ముందంజ వేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు, అంతర్జాతీయ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు మధ్యస్థంగా ఇరుకు గదులలో, చిన్న భవనాల్లో బడులు నిర్వహించే మధ్యతరగతి ప్రయివేటు స్కూళ్ళు మధ్యతరగతి ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఇక్కడ విద్యా ప్రమాణాల పాటింపు ఉండదు. ఉపాధ్యాయులకు సరైన వేతనాలుండవు. ఆటస్థలం ఉండదు. కనీస సౌకర్యాలుండవు. గతంలో ఒక స్కూలు లేదా కాలేజీ స్థాపించాలంటే విద్యాశాఖ అపరిమితమైన షరతులు పెట్టేది. ఇప్పుడవేమీ లేవు. ఎవరైనా స్కూలు లేదా కాలేజీ పెట్టుకోవచ్చు. ఆటస్థలం లేకపోయినా, ఇరుకు గదులైనా సరే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

చదువుకునే వయసు వచ్చిన బాలలకు కిలోమీటరు దూరంలో పాఠశాల ఏర్పాటుచేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. బాలకార్మికవ్యవస్థ నిర్మూలిస్తామని ఏటేటా మేడే సందర్భంగా ప్రచార ప్రకటనలు చేస్తోంది. కాని ఇప్పటికీ బాలకార్మికుల్లో, వీధిబాలల్లో ఆంధ్రప్రదేశ్

రాష్ట్రంలో పాఠశాలలు, ఉపాధ్యాయుల వివరాలు

పాఠశాలలు	సంఖ్య	టీచర్లు
ప్రాథమిక	58,250	1,27,000
ప్రాథమికోన్నత	14,500	85,000
ఉన్నత పాఠశాలలు	11,465	1,45,000

దేశంలో అక్షరాస్యతలో ఉంది. పొలాల్లో, కార్ఖానాల్లో, హోటళ్ళలో, మెకానిక్ షెడ్లలో ఎక్కడ చూసినా బాలకార్మికులు కనిపిస్తారు. వీధుల్లో చిత్తు కాగితాలు ఏరుకుంటూ, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో కాలక్షేపం చేస్తూ, బిచ్చపనులు చేస్తూ వేలాది వీధిబాలలు కనిపిస్తారు. ఈ సమాజం తయారు చేసిన వంచితులు వీరంతా. ఇటువంటి వారే సంఘవిద్రోహశక్తులకు ఆయుధాలుగా మారుతున్నారు. ఒకవైపున ఆకాశమే హద్దుగా ధనికుల బిడ్డలు చదువుల్లో మునిగిపోతుంటే గంజాయి దమ్ములో ఊగిపోయే ఇటువంటి అభాగ్యులు వేలాదిమంది తయారవుతున్నారు.

కార్పొరేట్ కాలేజీల ప్రచారయుద్ధం

పాఠశాల విద్యకు ఎంతోకొంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం ఇంటర్‌మీడియట్ విద్యను పూర్తిగా ప్రయివేటు సంస్థల ఇష్టారాజ్యానికి వదిలేసింది. విజయవాడ, గుంటూరు, నెల్లూరు పట్టణాలు కేంద్రంగా గల కొన్ని సంస్థలు రాష్ట్రమంతటా బ్రాంచీలు స్థాపించి వేలాది విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ఇటీవల కాలంలో జూనియర్ ఇంటర్‌కు సంబంధించి కార్పొరేట్ కాలేజీల మధ్య జరుగుతున్న ప్రకటనల యుద్ధం తీవ్రస్థాయికి చేరుతోంది. పదవతరగతి, ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే తమ సంస్థల గొప్పతనం గురించి చెప్పుకోవడానికి లక్షల రూపాయలు వెచ్చించి ప్రకటనలు ఇస్తున్నాయి. రోడ్లపై పెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. పదవతరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలోనే తమ ఏజంట్లను పంపించి పరీక్షా కేంద్రాల వద్దే ప్రచారం చేస్తున్నాయి. అనంతరం పాఠశాలలకు వెళ్ళి బాగా చదివే విద్యార్థుల పేర్లు, అడ్రస్సులు సేకరించి నేరుగా వారి ఇళ్ళకు ఏజంట్లను పంపిస్తున్నాయి. అంతేగాకుండా పోస్టు ద్వారా కాలేజీ వివరాలతో కూడిన రంగురంగుల బ్రోచర్లు పంపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అయితే చదువుకున్న నిరుద్యోగులను చేరదీసి వారికి కమిషన్ ఆశపెట్టి ఇంటింటికి తిప్పి ప్రచారం చేస్తున్నాయి. ఒక విద్యార్థిని చేర్పించగలిగితే వెయ్యినుండి రెండు వేల రూపాయల వరకు కమిషన్‌గా ఇస్తున్నాయి. ప్రయివేటు స్కూళ్ళ ప్రధానోపాధ్యాయులు, ట్యూషన్లు చెప్పే టీచర్లకు ప్రలోభాలు చూపించి తమ కాలేజీలకు విద్యార్థులను రప్పించుకుంటున్నాయి. ఈ కాలేజీల్లో ఎంపిసి, బైపిసిలకు ఏడాదికి రు.20 వేల నుండి రు.25 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. ఇక హాస్టల్‌లో కూడా ఉండదలచుకుంటే వారు రు.35 వేల నుండి రు.45 వేల వరకు చెల్లించాలి. ఈ కాలేజీల ప్రచార పటాటోపం చూసి మధ్యతరగతి తల్లిదండ్రులు కూడా అనేక వ్యయ, ప్రయాసలకోర్చి తమ పిల్లలను ఇక్కడే చేర్పిస్తున్నారు. సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్నవారి పిల్లలంతా ఇటువంటి కాలేజీల్లోనే చేరుతున్నారు. ఫీజు ఎన్నివేలు వసూలు చేసినా రశీదు ఇచ్చేది మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు మాత్రమే. మిగిలినదంతా లెక్కలోకి రాదు. ఒక భవనం అద్దెకు తీసుకుని ప్రారంభించే ఇటువంటి కాలేజీలు కొద్ది సంవత్సరాలలో స్వంతభవనాల్లోకి మారడం, రాష్ట్రవ్యాప్తంగా బ్రాంచీలు నెలకొల్పడం చూస్తున్నాం. ధనికుల, ఉన్నతాధికారుల పిల్లలు, రాజకీయ నాయకుల పిల్లలు ఇక్కడే చదువుతున్నారు. ఫీజు ఎంతైనా కడుతున్న అధికారగణం అదంతా నల్లధనంగా మారుతున్నా, కళ్ళముందే కార్పొరేట్ కళాశాల యజమానులు కోటీశ్వరులవుతున్నా గుడ్లప్పగించి చూస్తున్నారు. సామాన్యులపై నడ్డివిరిగే పన్నులు వేసే ప్రభుత్వం వీరి జోలికి మాత్రం వెళ్ళడం లేదు. ఈ కాలేజీల్లో విద్యార్థి వికాసానికి బదులుగా పొద్దస్తమానం రుద్దుడు కార్యక్రమమే జరుగుతోంది. విద్యార్థిపై ఒత్తిడి పెరుగుతోంది. చదువుల భారం తట్టుకోలేక, తోటి విద్యార్థుల స్థాయికి చేరుకోలేక కొంతమంది ఆత్మహత్యల బాటపడుతున్నారు. చదువులు వారి జీవితాలనే బలిగొంటున్నాయి. మూడు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో అనేకమంది విద్యార్థులు ఈ ఒత్తిళ్ళను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నారు. వర్తమాన సంవత్సరంలో కూడా అక్కడక్కడా ఇటువంటి సంఘటనలు జరిగాయి. కార్పొరేట్ కాలేజీల చదువు, విద్యార్థుల పరిస్థితి, ఆత్మహత్యలకు దారితీస్తున్న కారణాల గురించి అధ్యయనం జరిపి, వాటిని నివారించడానికి ప్రభుత్వం ఒక కమిటీ నియమించింది. దీనిపై నీరజారెడ్డి కమిషన్ ఇచ్చిన నివేదికను సైతం ప్రభుత్వం ఇంతవరకు బయటపెట్టలేదు. ఇంజనీరింగ్ విద్యలో చేరేవారికి ఎంసెట్‌తో పాటుగా ఇంటర్‌మీడియట్‌లో వచ్చిన మార్కుల వెయిటేజీ కూడా ఇవ్వాలని వచ్చిన ఒత్తిడికి తలవంచి ఆ దిశగా చర్చోపచర్చలు నడిపింది. ఎంతకాలం చర్చించినా ఏకాభిప్రాయం సాధించలేక ఎటూ తేల్చుకోలేకపోయింది. ఇంటర్ మార్కుల వెయిటేజీ ఇస్తే అత్యధిక మార్కుల సాధన కోసం కొన్ని ప్రయివేటు సంస్థలు అనైతిక చర్యలకు పాల్పడతాయని అనేకమంది విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులపై ఒత్తిడి మరింత పెరుగుతుందని కూడా ఆందోళన వ్యక్తం అవుతోంది. అదేవిధంగా ఎంసెట్‌లో అర్హత మార్కులను తగ్గించాలని ప్రతిపాదించి విరమించుకుంది. రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు అపరిమితంగా పెరిగిపోవడంతో గత ఏడాది దాదాపు 6 వేల సీట్లు మిగిలిపోయాయి. దీంతో ప్రయివేటు కాలేజీల నుండి ఒత్తిళ్ళకు తలవంచి అర్హత మార్కులు తగ్గించాలనుకుంది. పైగా ఈ ఏడాది ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 'ఫ్రీ' సీట్లను రద్దు చేసి కామన్ ఫీజ్ నిర్ణయించి సామాన్యులపై మరింత భారం మోపింది. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటు విద్యావిధానం వల్ల ఉన్నత విద్యలో జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలు కొరవడి ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కాలేజీలు పెరిగినంత వేగంగా పరిశ్రమలు పెరగకపోవడంతో ఇంజనీరింగ్ విద్య కొరగాకుండా పోతోంది. ఇప్పటికే బిసిఏ కాలేజీలు చాలావరకు మూతపడ్డాయి. విద్యావిధానంపై ఒక సమగ్ర దృక్పథం లేకపోవడం, ప్రయివేటు సంస్థలపై ఆధారపడటంతో రాష్ట్రంలో విద్యారంగం దారితప్పి నడుస్తోంది. ◆



మీ ఆరోగ్య పరిరక్షణ మీ చేతుల్లోనే...

పిల్లలలో గాని, పెద్ద వారిలో గాని సంభవించే వ్యాధులలో నూటికి సగానికి పైగా వ్యాధులను తేలికైన, అందరూ అమలుపరచగలిగే జాగ్రత్తలతో సులభంగా నివారించవచ్చు.

పరిసరాలు - పరిశుభ్రత :

మీ ఇల్లు ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటారో పరిసరాలు కూడా అంత శుభ్రంగా ఉంచండి. ఇల్లు ఊడ్చిన చెత్తను మురికి కాలువలో వేయకండి. ఇంటి చుట్టుపక్కల నీరు నిలువ ఉండకుండా చూడండి. నీరు నిలువ వున్న చోట కిరోసిన్ చల్లాలి. నీరు నిలువ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయి. దోమల వలన మలేరియా, బోదకాలు, మెదడువాపు వగైరా వ్యాధులు వ్యాప్తి చెందుతాయి.

పరిసరాల పరిశుభ్రతతోను, కాచివడగట్టిన నీరు తాగడంతోను టైఫాయిడ్, కలరా, అతిసార వ్యాధి, కామెర్లు వగైరా వ్యాధుల నివారణ సాధ్యమే.

జ్వరంతో పాటు కామెర్లు కనబడితే ప్రాణాంతక మలేరియా వ్యాధి కావచ్చు. సరైన సమయంలో సరైన వైద్యంతో ప్రాణాపాయాన్ని నివారించవచ్చు.

గుండెజబ్బులు - నివారణ :

ప్రతిరోజూ 40 నిమిషాల నుండి గంట వరకు నడవాలి. పళ్ళు, ఆకుకూరలు, పప్పులు ప్రతిరోజూ తినాలి. నూనె పదార్థాలు, మాంసాహారం ఎంత తక్కువ తింటే ఆరోగ్యానికి అంత మంచిది. ఉప్పు సాధ్యమైనంత తక్కువ తినడం మంచిది. పొగతాగడం ఆరోగ్యానికి హానికరం.

ఛాతిలోగాని, పైపొట్ట, మెడ, భుజాలలతో నొప్పి, మంట, చెమట పట్టడం వంటివి గుండెపోటు లక్షణాలు. అజీర్తి అని అశ్రద్ధ చేయరాదు. గుండెపోటు వచ్చినప్పుడు మొదటిగంట అమూల్యం. సరైన సమయంలో సరైన వైద్య సహాయం ప్రాణాపాయాన్ని నివారిస్తుంది.

గర్భిణీ స్త్రీలు - జాగ్రత్తలు :

1. నెల తప్పిన వెంటనే డాక్టర్ని సంప్రదించడం మంచిది.
2. డాక్టర్ల పర్యవేక్షణలోనే మందులను వాడాలి. కొన్ని మందులు గర్భస్థ శిశువుకు హానికరం.
3. పోషకాహారం, పరిమిత వ్యాయామం అవసరం.
4. ప్రతినెల వైద్య పరీక్ష అవసరం.
5. అవసరమైన రక్త పరీక్షలు, నీరుడు పరీక్ష, బి.పి. పరీక్ష చేయించుకోవాలి.
6. రెండు డోసులు ధనుర్వాతం టీకాలు వేయించుకోవాలి.
7. హాస్పటల్‌లో ప్రసవం తల్లికి, బిడ్డకు క్షేమకరం.
8. గర్భిణీ స్త్రీలో ప్రమాద సూచికలు : రక్తస్రావం, గర్భస్థ శిశువు కదలికలు తగ్గిపోవడం, ఉమ్మనీరు పడిపోవడం, అధిక రక్తపు పోటు, తలనొప్పి, కళ్ళు మసకలు, మూర్ఛ.

శిశుసంరక్షణ :

1. బిడ్డకు తల్లిపాలు అత్యుత్తమం.
2. బిడ్డకు 5వ నెల నుండి తల్లిపాలే కాక ఘన ఆహారాన్ని కూడా ఇవ్వాలి. ఈ ఘన ఆహారాన్ని ఇంట్లోనే చౌకగా చేసుకోవచ్చు. పప్పు, కాయధాన్యాల మిశ్రమం ఉత్తమం.
3. తల్లిదండ్రులందరు బిడ్డ 5 సంవత్సరాలలోపు వేయించవలసిన టీకాలను గూర్చి తెలుసుకోవడం తప్పనిసరి. పుట్టిన వెంటనే బి.సి.జి., పోలియో తర్వాత 6, 10, 14 వారాల వయసులో డి.పి.టి. ఇంజక్షను, పోలియో చుక్కలు, 9వ నెలలో పొంగు ఇంజక్షను, పోలియో చుక్కలు, 15వ నెలలో ఎమ్.ఎమ్.ఆర్., 18 నెలలకు డి.పి.టి., పోలియో చుక్కలు, 5 సంవత్సరములకు డి.పి.టి., పోలియో చుక్కలు వేయించాలి.
4. నీళ్ళ విరేచనాలు అవుతున్న బిడ్డకు మందుల కంటే ప్రాణ రక్షణ ద్రవాన్ని ఇవ్వడం అతి ముఖ్యం. గ్లాసు నీటికి 1 చెంచా పంచదార, చిటికెడు ఉప్పు కలిపితే అది ప్రాణరక్షక ద్రవం అవుతుంది. దీనిని బిడ్డకు కొద్దికొద్దిగా ఎక్కువసార్లు తాగించాలి.
5. పిల్లలను పనిలో కాదు బడిలో చేర్పించండి.
6. ఆడపిల్లల చదువులో అశ్రద్ధ చేయవద్దు.
7. ఇల్లాలి చదువు ఇంటికి దీపం, జాతికి వెలుగు.

మహిళలు - ఆరోగ్య జాగ్రత్తలు :

కుటుంబ సంరక్షణతో పాటు తమ సంరక్షణ పట్ల కూడా శ్రద్ధ వహించాలి. పోషకాహారం తీసుకోవాలి. ఒక్కరు లేదా ఇద్దరు బిడ్డలు ముద్దు, అంతకు మించి వద్దు. డాక్టర్ల సలహాతో గర్భ నిరోధక పద్ధతులను (పిల్స్, ఐ.యు.సి.డి.(లూప్)) వగైరాలను వాడడం శ్రేయస్కరం. లూప్‌పై అపోహలు ఎక్కువ. అవగాహన తక్కువ. ఇది హానికరమైన పద్ధతికాదు. నూటికి కోటికి ఒకరికి మాత్రం కొన్ని సమస్యలు రావచ్చు. దానిగురించి భయపడనవసరం లేదు. బిడ్డకు, బిడ్డకు మధ్య కనీసం 2 సంవత్సరాల

ఎడం తల్లికి, బిడ్డకు మంచిది. 30 సంవత్సరాల వయస్సు దాటిన తర్వాత ప్రతి 6 నెలలకు ఒకసారి డాక్టర్‌తో పరీక్ష చేయించుకోవడం వలన గర్భకోశ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్‌ను ముందుగా కనిపెట్టే అవకాశం ఉంటుంది.

ఎయిడ్స్ :

ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది ?

1. ఎయిడ్స్ ఉన్న వ్యక్తితో సెక్స్‌లో పాల్గొనడం వలన
2. ఎయిడ్స్ ఉన్న వ్యక్తి రక్తాన్ని మరొకరికి ఎక్కించడం వలన
3. ఎయిడ్స్ ఉన్న స్త్రీ గర్భం ధరిస్తే తల్లి నుండి నేరుగా గర్భస్థ శిశువుకు
4. ఎయిడ్స్ ఉన్న వ్యక్తికి ఇంజక్షన్ చేసి, శుభ్రపరచకుండా అదే సూదితో మరొకరికి ఇంజక్షన్ చేయడం వలన.

ఎయిడ్స్ వ్యాధి ఎలా రాదు ?

ఎయిడ్స్ ఉన్న వ్యక్తితో కరచాలనం చేసినా, అతని వస్త్రవుల వాడినా, అతనితో కలిసి ఒకేచోట జీవించినా రాదు.

ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు :

నెలకు పైగా మించి దగ్గు, జ్వరం ఉండటం, అతిగా బరువు కోల్పోవటం, చంకలో, గజ్జలో మెడ దగ్గర లింఫ్ గ్రంథులు వాయడం. వదలకుండా వేధించే విరేచనాలు. ఎయిడ్స్ వ్యాధికి పూర్తి వైద్యం లేదు. నివారణే మార్గం.

నివారణ :

1. ఒకే ఒక జీవిత భాగస్వామితో లైంగిక సంబంధం.
2. కండోమ్ ఉపయోగం.
3. హెచ్ఐవి పరీక్ష చేసిన పరిశుభ్రమైన రక్తాన్ని మాత్రమే ఎక్కించుకోవడం.
4. ఇంజక్షన్లకు కనీసం 20 నిముషాలు మరగపెట్టిన సూదులు లేదా కొత్త సూదులు, సిరెంజిల వాడకం వలన
5. క్షౌరశాలల్లో ప్రతీసారీ కొత్త బ్లేడ్ల వాడకం.

క్యాన్సర్ - ప్రమాద సూచికలు :

1. మానని పుండు, బరువు తగ్గడం
2. అకారణ రక్తస్రావం, డిశ్చార్జి
3. రొమ్ములో కణితి, మరెక్కడైనా కణితులు
4. పుట్టుమచ్చలో, పులిపిరి కాయలో మార్పు
5. విరేచనంలో, మూత్రంలో మార్పు.
6. విడవకుండా వచ్చే దగ్గు, గొంతులో మార్పు.
7. ఆకలి లేకపోవడం, అధికరక్తహీనత.
8. పరీక్షలలో అంతుపట్టని, తగ్గని జ్వరం.

తొలిదశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా అదుపు చేయవచ్చు.

మధుమేహ వ్యాధి-కొన్ని సూచనలు - జాగ్రత్తలు :

1. క్రమబద్ధంగా ఆహారం తీసుకోవాలి.
2. భోజనం మానివేయుట, ఉపవాసం చేయరాదు.
3. ఆహారంలో ప్రొటీన్లు, ఫైబర్ (పీచు పదార్థం) అధికంగా ఉండాలి. అనగా పప్పు ధాన్యాలు, ఆకు కూరలు, కాయగూరలు భుజించాలి.
4. బరువు అధికంగా కలవారు మితంగా భుజించి ప్రతిరోజూ వ్యాయామం చేయడం ఎంతో ముఖ్యం.
5. చక్కెర, బెల్లం, తేనె, గ్లూకోజ్, తీపి పదార్థాలు, ఐస్‌క్రీమ్,, జామ్‌లు, దుంపకూరలు, కూల్‌డ్రింక్స్ మొదలైన పదార్థాలు వాడకూడదు.
6. కాళ్ళకు, పాదాలకు దెబ్బలు తగలకుండా జాగ్రత్త తీసుకోవడం ఈ వ్యాధి గల వారికి చాలా ముఖ్యం.

40 సంవత్సరాలు దాటిన ప్రతివారూ ప్రతి సంవత్సరం జనరల్ చెకప్ చేయించుకోవడం అవసరం. అప్పుడు రక్తపోటు, మధుమేహం (షుగర్) మొదలైన వ్యాధులను ముందుగా కనుగొని సరైన వైద్యం చేయించుకోవచ్చు. దానివలన పక్షవాతం, గుండె జబ్బులు వగైరాలు రాకుండా జాగ్రత్త పడవచ్చు. ◆

ఆహారములో మార్పులతో క్యాన్సర్ నివారణ సాధ్యమా!



మనం తీసుకొనే ఆహారంలో కొద్దిపాటి మార్పులు చేస్తే క్యాన్సర్ రావడాన్ని నివారించవచ్చు. ఫైబర్ (పీచు) ఎక్కువగా వున్న ఆహార పదార్థాలు, ఐరన్, విటమిన్స్ ఎ, ఇ, కె మొదలగునవి క్యాన్సర్ నిరోధించడంలో మనకు ఎంతో ఉపయోగపడతాయని క్యాన్సర్ కంట్రోల్ ప్రోగ్రామ్ సలహాదారునిగా అజాద్ మెడికల్ కాలేజీలో రేడియో థెరపీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మనోజ్‌శర్మ చెప్పారు.

పండ్లు, బాదం, మొలకెత్తిన ధాన్యాలు క్యాన్సర్ వాహకాలైన నైట్రోసోమైన్‌ను చేరి క్యాన్సర్‌ను నిరోధిం చడంలో ఉపకరిస్తాయి. పండ్లు, కాయగూరలలో అధిక మోతాదులో వుండే ప్లేవానాయిడ్స్ డిఎన్ఎలో క్యాన్సర్ కారకాలకు అడ్డుకట్టలేస్తాయి. ఉల్లి, వెల్లుల్లి కణితుల (ట్యూమర్స్)ను నిరోధించడంలో, అలాగే పసుపు పచ్చని కాయగూరలు, పండ్లలో వుండే రెటినాయిడ్స్ హాని కలుగజేసే కణాలను నిర్మూలిస్తాయని ఈయన తెలిపారు.

ఈ క్యాన్సర్ నిరోధకాలు ఎక్కువభాగం ఇండియాలోనే లభ్యమవుతాయని, భారతీయ ఆహార అలవాట్లయిన గోధుమలు, బార్లీ, జొన్న, ఆకుకూరలు, పప్పులు, కూరల్లో వేసే పసుపు మొదలగునవి ముఖ్యమైనవని తెలిపారు.

కాయగూరల్లో ఎక్కువగా ఫైబర్ వుంటుంది. దీనికారణంగానే గ్రామీణులలో తక్కువశాతం మాత్రమే కోలన్ క్యాన్సర్‌కు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శర్మ ఒక ఉదాహరణగా మాంసాహారం ఎక్కువగా తీసుకొనే దక్షిణ యూరప్‌లో కన్నా శాఖాహారం ఎక్కువగా తీసుకొనే ఉత్తర యూరప్‌లో ఈ వ్యాధి (క్యాన్సర్) తక్కువ శాతంలో వుందని తెలిపారు. ◆

* ముదిగంటి సుజాతారెడ్డి

లలితా, గాయత్రీ ఇద్దరూ కలిసి వచ్చారు మా ఇంటికి.

"ఏమిటే! ఇద్దరూ ఎక్కడ కలుసుకున్నారు. నా మీద దాడి చేస్తున్నట్లుగా దిగారు" నవ్వాన్నేను.

"పాపం! గాయత్రికి ఏం చేయాలో తోచడం లేదే" అంది లలిత సోఫాలో కూలబడుతూ.

"ఎందుకు గాయత్రీ! ఏమైంది నీ కొడుకు ఎసెస్సీ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు కదా!"

"ఆ... రెండుసార్లు దండయాత్ర తర్వాత ఈసారి ఫస్టుక్లాసులో పాసయ్యాడు."

"మరింకేం సంతోషించక..."

పరీక్షా ఫలితాల్లో కరువు లేదు

"అది కాదే ఇంటర్ ఏ కాలేజీలో చేర్పించాలా అని గాయత్రికి ఏం తోచడం లేదు. ఒకరు ఓ కాలేజీ బాగుందంటున్నారు. మరొకరు మరో కాలేజీ బాగుందంటున్నారు.. ఇక పత్రికల్లోనేమో పెద్ద పెద్ద ప్రకటనలు! తమకిన్ని ర్యాంక్స్ వచ్చాయి అన్ని ర్యాంక్స్ వచ్చాయి అని. దాంతో పరేషానయి తోచక నీ సలహా తీసుకుందామని వచ్చాం."

"అబ్బ! దానికి నా సలహా ఎందుకే. ఇంటికి దగ్గరగా బాగా చదువు చెప్పే కాలేజీ చూసి జాయిన్ చెయ్యక" అన్నాన్నేను అదేం పరేషానయ్యే విషయం అన్నట్లుగా.

"అది కాదే! కొన్ని కాలేజీల్లో ఫీజులు బోలెడు అడుగుతున్నారు. పైగా ట్యూషన్లని డబ్బు వసూలు అదనంగా తీసుకుంటున్నారు. మరికొన్ని కాలేజీల్లో ఫీజులు తక్కువుంటే అక్కడ చదువు బాగుండదేమోనని గాయత్రికి అనుమానం. అందుకే ఏం తోచక వచ్చామని అంటున్నాను" అంది లలిత.

"నిజమే! ధర్మసందేహమే! గాయత్రీ! నువ్వు కట్టగలిగినంత ఫీజు చూసుకొని ఇంటికి దగ్గరగా వుండే కాలేజీలో జాయిన్ చెయ్యి. అనవసరంగా నువ్వు టెన్షన్లో పడ్తున్నావు. నిన్ను చూసి నీ కొడుకు టెన్షనవుతాడు" అన్నాన్నేను.

"వాడప్పుడే టెన్షన్లో వున్నాడు. అసలు వాడు టెన్త్‌లోకి వస్తున్నాడన్నప్పట్నుంచే ఇంట్లో మాకు టెన్షన్ మొదలైంది. అప్పు చేసైనా సరే మంచి కాలేజీలో చేర్పించమంటున్నారు మావారు. ఆయనకేమో ఆఫీసుని తీరిక ఉండదు. వాడి చదువు వ్యవహారాలన్నీ నేను చూసుకోవాలి. నాకేం పాలుపోక లలితను సలహా అడిగాను. లలితేమో నీతో మాట్లాడదామంది. అందుకే వచ్చాం నీ దగ్గరకి" అంది గాయత్రి. ఆమె ఎంతో టెన్షన్లో ఉంది. కొడుకు ఇంటరైపోయి వాడు ఎంట్రన్స్ రాసే నాటికి గాయత్రి చిక్కి శల్యమై పోతుందేమో టెన్షన్‌తో అనిపించింది నాకు. ఎందుకంటే ఇంటర్‌లోకి పిల్లలు వచ్చేసరికి తల్లిదండ్రులు బోలెడంత టెన్షన్ పడిపోతున్నారని ఈ సిస్టమ్‌నే తూర్పార పట్టి ఓ వీర వనిత చివరికి కొడుకు ఎంట్రెన్స్ పాసయ్యే వరకు టెన్షన్‌తో షుగర్ వ్యాధి తెచ్చుకున్న ఉదంతం జ్ఞాపకం వచ్చి గాయత్రి వైపు సానుభూతిగా చూశాను.

"అయినా గాయత్రీ! రెండుసార్లు టెన్త్‌లో ఫెయిలై ఇప్పుడు ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడంటున్నావు. అదేమిటే అంతమంచి స్టూడెంటు, ఫస్టుక్లాసు స్టూడెంటు రెండుసార్లు ఎట్లా ఫెయిలయ్యాడు?" సందేహంగా గాయత్రి వైపు చూశాన్నేను.

"రెండుసార్లు ఫెయిలైనప్పుడు కంప్యూటర్ మిస్టేక్ అన్నారు స్కూల్లో టీచర్లు. వాడు బాగా చదువుతాడు. కాని ఫెయిల్/పాస్ మన చేతిలో వున్నాయా చెప్పు" అంది గాయత్రి.

"ఈసారి టెన్త్ రిజల్ట్సు మా బాగా వచ్చాయి!" అంది సంబరపడిపోతూ లలిత.

"అవును! డెబ్భై ఐదు శాతం విద్యార్థులు పాసయ్యారట!" అంది గాయత్రి.

"ఎన్నడూ లేనంత రిజల్ట్సు పంట! ఎమ్‌సెట్‌లోనూ అంతేనట! పాస్‌మార్కులు తగ్గించడంతో ఎమ్‌సెట్‌లో బోలెడు మంది క్వాలిఫై అయ్యారట!" ఉప్పొంగిపోతూ అంది లలిత.

"అంటే! ఈసారి విద్యార్థులు బాగా చదివారా? లేక..."

"లేక ఏమిటి...! నీ కన్నీ అనుమానాలే!" అంది గాయత్రి టెన్షన్లోంచి బయటికి వచ్చి.

"ఏమోనే! నాకనుమానంగానే ఉంది" అన్నాన్నేను.

"అనుమానం దేనికీ!" లలిత అనుమానంగానే నా వైపు చూసింది రెప్పార్పకుండా. దానికీ అనుమానం వచ్చినట్లుంది.

"ఏమో! కరువు! నీళ్ళ కరువు! తిండి కరువులతో ప్రజలు బాధపడిపోతున్నారనీ పరీక్షా ఫలితాల్లో కరువెందుకనీ... ఇంతమందిని పాస్ చేసినట్లా!..." ఆగుతూ ఆగుతూ అన్నాన్నేను.

"నీకెప్పుడూ విమర్శలే. నువ్వసలు అపోజిషన్లో బాగా రాణిస్తావే!" నవ్వింది లలిత.

"ఏమో! ఏమైనా కంప్యూటర్ మహిమనో ఏమో లేకపోతే ఇంతమంది పాస్ ఏమిటి! ఇన్ని ఫస్ట్‌క్లాసులేమిటి!" గొణుగుతున్నట్లుగా అన్నాన్నేను. లలిత, గాయత్రీ ఏమీ వినే మూడ్‌లో లేరు. ◆

కాంతిపుంజం

మేము వెదుకుతూనే ఉంటాం
నిరంతరం వెదుకుతూనే ఉంటాం
ప్లాస్టిక్ చీరసింగారాల
మీ జలకన్య వైపు కన్నెత్తలేక
భూమి పొరల్ని తడికోసం
తడుముకుంటున్నప్పుడు...
మీ చెత్తకుండీలు మా చుట్టాలై
ప్లాస్టిక్‌పై ఇంకిపోని మా కన్నీళ్ళు
వెక్కిరిస్తున్నప్పుడు....
మీ ఛానెల్ బ్రహ్మలు
మా మెదడులోని
ఒక్కో న్యూరాన్నీ చెక్కుతున్నప్పుడు...
మీ మధ్యవర్తిత్వాల మాయాజాలంలో అస్తిత్వాలను కోల్పోయి
అప్పులే మా ఆస్తులైనప్పుడు...
ఏ పేటెంట్ లేని అభాగ్యుడు
అవయవాలను ఆకలికి
అమ్ముకుంటున్నప్పుడు...
మేము వెదుకుతూనే ఉంటాం
కాంతి రేఖలకై నిద్రలోనూ మా కళ్లను
తెరిచే ఉంచుతాం
కలిసే కాంతి రేఖలకై
మేము మెలకువలోనే ఉంటాం.
(నయా వలస వాదాన్ని నిరసిస్తూ)

✻ శాఖమూరి శ్రీనివాస్

ప్రశ్నార్థకం

మనసు జారుడుబండపై
దుడుకు చేష్టలు వీడని పసిబాలల్లా
ఆలోచనలు జారుతూనే వుంటే
నయవంచనల నైజానికి
నైతిక విలువల మే కప్పు
నెంతకాలం ధరించగలవు ?
మాంసపు గూటిలోని రామచిలుక
నిముషానికి
డెబ్బది రెండుసార్లు అరవడానికేనా ?
సాటి మనిషిపై సానుభూతితో
ఒక సెకను
స్పందించడానికెందుకు కాదు?
మనిషి అనే మర తుపాకీ కమర్చుకున్న
పెదవులనే డబుల్ బారల్స్ నుండి
వెలువడే తూటాలు - పరుల
ఆత్మాభిమాన కోటల్ని, కూల్చడానికేనా ?
శల్య సారధ్యపు వేగం తగ్గించి చూస్తే
కలియుగ కర్ణులెందరు కనుపించరు ?
అందమైనదని భ్రమిసే మనస్సును
ఆత్మవిమర్శ అనే అద్దం ముందుంచితే
పశ్చాత్తాప ప్రతిబింబమెందుకు కనుపించదు ?
నీవు - నేను - మనమందరం
ప్రపంచ శాంతివనంలో
మానవత్వ పారిజాత
సౌరభాలెందుకు వెదజల్లలేము ?

✻ ముండ్లపాటి జాన్ ప్రభాకర్

పిల్లల మనోవికాసం తల్లిదండ్రుల పాత్ర

✻ కె.ఎస్.కుమార్



పిల్లలు మట్టిముద్ద లాంటి వారు. వారిని మనం ఎలా మారిస్తే అలాగే తయారవుతారు. భవిష్యత్ రూప కల్పనకు బాల్యం పునాది. చుట్టూ వున్న సమాజం పట్ల అవగాహన పెంచుకోవ డానికి చిన్నతనం నుండే తగుదైన వ్యక్తిత్వాన్ని [illegible] పిల్లలకు పెద్దలు [illegible] ఆట పాటలు, [illegible] చెప్పే రాకుమారుల, [illegible] కథలు పిల్లల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించేవి. కాని నేటితరం పిల్లలు ఎలక్ట్రానిక్ మీడియా వల్ల ఆకర్షితులై వాటి చేతిలో కీలు బొమ్మలుగా మారి వారి సొంత ఆలోచనలకు దూరమై తద్వారా సృజనాత్మకత నశించి అచేతనంగా మారుతున్నారు.

అంతేకాక పిల్లలు తమ ప్రమేయం లేకుండా ముందే నిర్దేశించబడిన లక్ష్యాల వల్ల ఒత్తిడికి గురై తమ స్వేచ్ఛకు భంగం కలిగినట్టుగా భావిస్తున్నారు. తల్లిదండ్రులపై తమ వ్యతిరేకతను పెంచుకుంటున్నారు. పిల్లల వ్యక్తిత్వం వారికి వారి తల్లిదండ్రుల మధ్య అనుబంధాన్ని బట్టి మాత్రమే నిర్మితమవుతుంది. కాని తల్లిదండ్రులు చెప్పే నీతి వాక్యాల వల్ల కాదని తల్లిదండ్రులు గుర్తించాలి.

అందుకు తల్లిదండ్రులు పిల్లల మనోవికాసానికి దోహదపడే విధంగా చిన్నతనం నుండే జాగ్రత్త వహించాలి. వారిని అర్థం చేసుకోవడం మన ధ్యేయం కావాలి.

పిల్లలకు పుట్టకతోనే ఈ ప్రపంచానికి సంబంధించిన విషయాలు తెలియవని తల్లిదండ్రులు గుర్తించాలి. కాని వారికి సహజంగానే తెలుసుకోవాలన్న కుతుహలం ఎక్కువగా ఉంటుంది గనక పెద్దలు వారిని విసుక్కోకుండా సమాధానాలివ్వాలి. లేకుంటే ఆత్మన్యూనతకు, గురయ్యే ప్రమాదం ఉంది.

పెద్దలు ప్రపంచ జ్ఞానానికి సంబంధించిన విషయాలు, దేశాలు, రాజకీయాలు వంటి సహజ పరిజ్ఞానాన్ని పిల్లలకు చిన్నతనం నుండే నేర్పించాలి.

పిల్లలు ఏదైనాతప్పు చేసినప్పుడు వారిని కఠిన పదజాలంతో దూషించకూడదు. వారిపట్ల ప్రేమతో వ్యవహరించాలి. పిల్లలకు చిన్నప్పటి నుండి పనులు చేయడానికి మాత్రమే అలవాటు పడుతుంటారు. ప్రతి పనిని తల్లిదండ్రులు నిర్ణయిస్తే వారు ఆ పనులు చేయడానికి మాత్రమే అలవాటు పడతారు. తమంతట తాము నిర్ణయాలు తీసుకునే శక్తి కోల్పోతారు.

బాధ్యతలను తల్లిదండ్రులు పిల్లలపై రుద్దకుండా పిల్లలు తమ కర్తవ్యాలను తమంతంట తామే అలవరుచుకొనే కుటుంబ వాతావరణాన్ని కల్పించాలి. పిల్లల మనసులో రకరకాల భావాలు కలుగుతుంటాయి. పిల్లల మనసులో చెలరేగే వివిధ భావాలను స్పష్టంగా గుర్తించాలి. అదేవిధంగా వాటిని వ్యక్తం చేసే అవకాశాన్ని వారికి కల్పించాలి.

పిల్లల మాటల్లోనూ, స్వరంలోనూ, వారి అభినయంలోనూ వారి కోరికలు, ఆలోచనలు వ్యక్తమవుతాయి. మనం వాటిని సరిగ్గా గుర్తించి అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్న విషయాలను వారికి తెలియపరచాలి. వారిని నిందించటం గాని, విమర్శించటం గాని చేయవద్దు. పిల్లలు తమకు ఎదురయ్యే అనుభవాల మూలంగానే అనేక విషయాలు నేర్చుకుంటారు. వారికి ఎప్పుడూ విమర్శలు ఎదురైతే వారు బాధ్యతలను అలవర్చుకోకపోగా ప్రతి ఒక్కరిలో లోపాలను ఎంచడానికి ప్రయత్నించి జీవితం పట్ల నిస్పృహను పెంపొందించుకుంటారు.

పిల్లల ప్రవర్తన తమకు నచ్చనప్పుడు తల్లిదండ్రులు పిల్లలను అవమానించడం, వారిని నిరాశపరచడం కాక వారి ప్రవర్తన తమకు ఎలా అనిపిస్తుందో, తాము ఎంతటి ఆందోళనకు లోనవుతున్నామో తెలియజేయాలి. పిల్లలకు పుట్టగానే బాధ్యత అంటే ఏమిటో తెలియదు. అలాగే ఫలానా వయస్సులో వారు బాధ్యతలను అలవరచుకుంటారని సైతం చెప్పలేము. బాధ్యతాయుతమైన ధోరణిని పెంపొందించుకోవడమన్నది వారికి నెమ్మదిగా అనుభవం వచ్చిన కొద్దీ అలవడుతుంది. కాని అతి చిన్న వయస్సులోనే ఈ ధోరణిని అలవర్చడానికి తల్లిదండ్రులు ప్రయత్నించాలి.

తల్లి దండ్రుల ఆదేశాలకు తల ఒగ్గే విధంగా కాకుండా తన జీవితాన్ని తనకిష్టమైన రీతిలో మలచుకోవడానికి, స్వతంత్ర శక్తిగా పిల్లలను తీర్చిదిద్దాలి. పిల్లల పాఠశాల జీవితంలో పాకెట్‌మనీకి చాలా ప్రాధాన్యం ఉంది. ఇవి పిల్లలు తమ అవసరాలకు ఖర్చు పెట్టుకోవడానికి కాకుండా ఏది అవసరమైన ఖర్చు, ఏవి అవసరమైన ఖర్చులో తెలుసుకొని బాధ్యతాయుతంగా ఖర్చు చేయడం ఈ వయస్సులోనే నేర్చుకోవడం జరుగుతుంది. పిల్లలు ఎదుగుతున్న కొద్దీ తల్లిదండ్రులు వారి అవసరాలను గుర్తించి కొంత డబ్బు అధికంగా ఇవ్వవలసి ఉంటుంది.

పిల్లలు ఎవరితో స్నేహం చేయాలో, ఎవరితో స్నేహం చేయగూడదో తల్లిదండ్రులు షరతులు విధించకూడదు. వారిని తమ ఇష్టం వచ్చిన వ్యక్తులతో స్వేచ్ఛగా స్నేహం చేయనివ్వాలి. పిల్లల స్నేహితుల ప్రవర్తన మరీ భరించలేనిదిగా తోస్తే తప్ప వారి విషయంలో జోక్యం కల్పించుకోకూడదు. కాని వారి స్నేహితులు ఎలాంటి వారో తెలుసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులకు వుంది.

ఈ పద్ధతిలో తల్లిదండ్రులు పిల్లలకు ప్రస్తుత సంక్లిష్ట సమాజంలో అడుగడుగునా ఎదురవుతున్న అనుకూల పరిస్థితులు ఎదుర్కొనేటట్లుగా తోడ్పడాలి. భావి సమాజం ఆరోగ్యంగా, పటిష్టంగా తయారవడానికి తమ వంతు మనోవికాసాన్ని ఉన్నతమైన స్థాయిలో తీర్చిదిద్దుకునే విధంగా తల్లిదండ్రులు సహకరించాలి. ◆

నక్క త్యాగం

ఒక నక్క ఆహారం కోసం వెతుకుతుండగా 'నక్కగూడెం' అనే బోర్డు కనిపించింది. దాన్ని చూసి అది బోలెడు ఆశ్చర్యపోయింది. ఆ వెంటనే చాలా సంతోషించింది కూడా. 'కృష్ణనగర్, శ్రీనివాసపురం వంటి ఎన్నో గ్రామాలను చూశాను. దేవుడి పేర్లతో గ్రామాలు వున్నాయికానీ ఇలా ఒక జంతువు పేరుమీద గ్రామం వుండడం నేను చూడలేదే. ఇలా పెట్టుకున్నారంటే ఈ గ్రామ ప్రజలకు నక్కలంటే చాలా గౌరవం వున్నట్టుంది. గౌరవం ఉన్న చోట ఉండడమే ఎవరికైనా క్షేమకరం. ఇకనుంచి ఈ ఊరినే అంటిపెట్టుకుని ఉంటాను' అనుకుని పక్కనున్న గుట్టలో ఓ గుహలో నివాసం ఏర్పరచుకుంది. రాత్రిళ్లలో ఊర్లోకి వచ్చి మేకపిల్లనో, గొర్రెపిల్లనో ఎత్తుకుని వెళ్లసాగింది. నక్కను పట్టుకుందామని గ్రామస్తులు వలలు కూడా పెట్టారు. కాని వలలో ఏనాడూ చిక్కలేదు. ఒకరోజు పట్టపగలే చింత చెట్లకింద మేస్తున్న కోళ్లల్లోంచి ఒక పుంజును నోట కరుచుకుని పరిగెత్తింది. దాన్ని చూసిన జనం కర్రలు పట్టుకుని వెంటపడ్డారు. అది పరుగెత్తి పరుగెత్తి గుట్టపైకి ఎక్కింది. జనమంతా ఆ గుట్ట దగ్గరకు చేరారు. అప్పుడు నక్క 'మీరంతా నక్క గూడెం ప్రజలేకదా?' అని పెద్దగా అరచింది.

'అవును...ఏం?' అన్నారు ప్రజలు.

'నేను నక్కనేగదా!' అంది.

'అవును. ఇంతకూ ఏం చెప్పదలచుకున్నావ్' అన్నారంతా.

'మీరు నామీద గౌరవంతోనే గదా మీరుండే ఊరుకు 'నక్కగూడెం' అని పేరు పెట్టుకున్నారు. ఆ పేరును చూసే మీకు నాపట్ల ప్రేమ, గౌరవం ఉన్నదని భావించి మీ ఊరి వక్క నివసిన్తున్నాను. ఆకలయినప్పుడు మీ మేకల్ని, కోళ్లనే తింటున్నాను. ఇప్పుడు మీరు ఎందుకు నావెంట పడుతున్నారో అర్థంకావడంలేదు' అంది నక్క

అప్పుడా ప్రజలు 'ఓసి పిచ్చి నక్కా! మా సంపదంతా దోచుకుతినే నీలాంటి దొంగ నక్క పేరు కాదు మేం పెట్టుకుంది. గతంలో మా ఊరికోసం ఓ నక్క ప్రాణత్యాగం చేసింది. ఆనక్క పేరు మేం పెట్టుకున్నాం. ఆ సంగతి చెబుతా విను' అని ఓ డెబ్బయ్యేళ్ల గ్రామ పెద్ద ఇలా చెప్పాడు.

'గతంలో మా ఊరుని 'చెరువుకింది గూడెం' అనేవారు. మా ఊరుకు సరిగ్గా పైన ఒక చెరువు వుంది. దాని మూలంగానే మేం రెండు పంటలూ పండించేవాళ్లం. ఓ సారి వర్షాలు బాగా కురవసాగాయి. వర్షం తుఫానుగా మారింది. ఏ క్షణంలోనైనా చెరువు కట్ట తెగేలా ఉంది. అంత నిండుగా వచ్చాయి నీరు. ఆ రాత్రి ఏం జరుగుతుందోనని ఊరి ప్రజలంతా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బిక్కు బిక్కుమని గడపసాగాం. ఆ రాత్రి తూము పక్కన చిన్న రంధ్రంపడి, నీళ్లు దిగువకు వచ్చాయి. పెద్ద గండి పడింది. అలా ఎవరమూ చూడకుండా తెల్లవారేదాకా వుంటే మా ఊరు మొత్తం కొట్టుకొని పోయేది. కాని ఆ రంధ్రాన్ని ఒక నక్క చూసింది. అది మా ఊరిని రక్షించాలని తూము మీద నిలబడి ఊరివైపు మోర సాచి ఆ తుఫానులో అదేపనిగా ఊళ పెట్టింది. దాని అరుపుకు మేలుకున్న గ్రామస్తులు కీడు శంకించి కర్రలు, లాంతర్లు పట్టుకుని చెరువువైపు వచ్చారు. తూము పక్కన పడిన రంధ్రంలోంచి బొళబొళా నీళ్లు పోతున్న శబ్దం వచ్చింది. లాంతర్ల వెలుగులో కట్టకు పడ్డ గండిని భయంతో చూశారంతా. వెంటనే పలుగు, పారలు తెప్పించి గండి పూడ్చడం మొదలుపెట్టారు. అప్పుడు నక్క అరవడం ఆపేసి పక్కనున్న పెద్ద గుండుమీదకెక్కి కూర్చుని వారు చేసే పని చూడసాగింది. అలా నక్క ఊళవేసి ఊరిని మేలుకొలిపి, ప్రజల్ని రక్షించింది. అందుకు ప్రతిఫలంగా తెల్లవారాక నక్కకు సన్మానం చేయాలని కొందరు, దానికి రోజుకు ఒక కోడిని బహుమతిగా యివ్వాలని మరికొందరు అనుకున్నారు. గండి పూడిక పూర్తి కావస్తుండగా తెల్లారింది. దగ్గరకు వెళ్లి చూసేసరికి చలికి , వర్షానికి నక్క శరీరం బిగుసుకుపోయివుంది. అర్థరాత్రే దాని ప్రాణాలు పోయినట్లనిపించింది. అప్పుడు అందరమూ కన్నీరు కార్చాం. ఘనంగా అంత్యక్రియలు చేశాం. తన ప్రాణాలను పణంగా పెట్టి ఊరిని రక్షించినందుకు మా ఊరి పేరును 'నక్కగూడెం'గా మార్చుకున్నాం. అలాంటి త్యాగం చేసిన నక్క పేరు మా ఊరికి పెట్టుకున్నామేకాని, మా సంపదను కాజేసే నీలాంటి నక్కపేరు కాదది' అన్నాడా పెద్దమనిషి.

ఆ కథంతా విని నక్క నిజంగానే సిగ్గుపడి అక్కడినుంచి అడవి లోపలికి కనపడకుండా వెళ్లిపోయింది.

– పుప్పాల కృష్ణమూర్తి



క్విజ్-60

1. 'చైనా దు:ఖదాయని' అని దేనిని పిలుస్తారు?
   ఎ.హోయాంగుహో బి.రైన్
2. రబ్బరు చెట్లు అధికంగా ఎక్కడ ఉన్నాయి?
   ఎ.కేరళ బి. ఆంధ్ర ప్రదేశ్
3. రాజ్యాంగమును సవరించేహక్కు ఎవరికి కలదు?
   ఎ. సుప్రీంకోర్టుకు బి. పార్లమెంటుకు
4. 'బ్రోకెన్ వింగ్' రచయిత?
   ఎ.ఇందిరాగాంధీ బి.సరోజినీనాయుడు
5. చక్రము దేనికి గుర్తు?
   ఎ. అభివృద్ధికి బి. విచారమునకు
6. ఒక త్రిభుజములో మూడు కోణముల మొత్తము?
   ఎ. 180 డిగ్రీలు బి. 90 డిగ్రీలు
7. మణిపూర్ రాజధాని?
   ఎ. ఇంఫాల్ బి.దిస్పూర్
8. 'రిఫరెండం' ఎక్కడ వుంటుంది?
   ఎ.పరోక్ష ప్రజాస్వామ్యం బి. ప్రత్యక్షం పజాస్వామ్యం
9. 'చెక్' అను భాగము వున్న పనిముట్టు?
   ఎ.రంపము
   బి.డ్రిల్లు యంత్రము
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. ఆంగ్‌సాంగ్‌సూకీ
   బి. జయతీఘోష్

చిన్నారి చిత్రకారులు

షేక్ ఖాసిం, 10వ తరగతి, జిల్లా పరిషత్ పాఠశాల, రొంపిచర్ల, గుంటూరు.

వై. ప్రత్యూష, 6వ తరగతి, శ్రీమల్లికార్జున పబ్లిక్‌స్కూల్, గన్నవరం, కృష్ణా.



కె.ప్రవీణ్, హరిపాలెం, విశాఖ.

అల్లి నాగేశ్వరరావు, 10వతరగతి, ఎన్.వి.హైస్కూల్, పెద్దాపురం, తూ.గో.జిల్లా.

విరగని అగ్గిపుల్ల

మేజిక్! మేజిక్!!

హాయ్ ఇవాళ మనం చూడబోయే మేజిక్ భలే తమాషాగా వుంటుంది. జాగ్రత్తగా గమనించండేం. ఆ... మెజీషియన్ వచ్చేశారు. గప్‌చిప్ సాంబారు బుడ్డి.



పిల్లలూ. వచ్చేశాను. మనం ఈ మేజిక్ చేయడానికి కావలసినవేంటంటే... ఒక అగ్గిపుల్ల, చేతి రుమాలు. ముందుగా ఈ రుమాలును బల్లమీద పరుస్తున్నాను. దాని మధ్యలో అగ్గిపుల్ల పెట్టాను. చూశారుగా. ఇప్పుడు రుమాలును మామూలుగా మడతపెట్టాను. ఇదిగో ఈ రుమాలును ఇలాగే వుంచి అందులో వున్న అగ్గిపుల్లను ముక్కలు ముక్కలుగా విరవాలి. ఎవరు చేస్తారు అలా? ఏంటి? ఎవరూ రావడం లేదు. అలా అయితే నేనే పిలుస్తా. ఆ... అలా వుండాలి. ఇదిగో రుమాలు. లోపలి అగ్గిపుల్లను ముక్కలు ముక్కలుగా విరిచేసెయ్. వెరీగుడ్. ఇప్పుడు చూడండి. రుమాలు మడత విప్పుతున్నాను. చూశారుగా. అగ్గిపుల్ల ఏమాత్రం విరగలేదు. ఇవాల్టికి ఈ మేజిక్ చాలు. వచ్చే వారం కలుద్దాం బైబై.

అమ్మయ్య మేజిక్ అంకుల్ వెళ్లిపోయారు. ఇప్పుడు ఈ మేజిక్‌మీద మీకు ఏమైనా అనుమానాలు వుంటే అడగండి. ఏంటి ఎవ్వరూ మాట్లాడరు? అరే నువ్వు చెప్పు. ఇందాక రుమాలులోని అగ్గిపుల్లను విరిచింది నువ్వేకదా. 'అ... ఇందులో ఏదో మోసం వుంది. నేను అగ్గిపుల్లను నాలుగు ముక్కలు చేశాను. అయినా అంకుల్ విరగని అగ్గిపుల్లను బయటకు తీశారు'. ఓస్ అంతేనా. దానికే బుంగమూతిపెట్టాలా! నేను చెప్తాగా. రుమాలు చూడండి. నాలుగు పక్కలా కొద్దిగా మడతపెట్టి కుట్టి వుంది. చూశారా! ఆ... అందులో ఒక మూలన ఒక అగ్గిపుల్లను దాచిపెట్టాలి. ఈ విషయం ప్రేక్షకులకు తెలియదుకదా. తర్వాత రుమాలు మడత పెట్టేటప్పుడు దాచిపెట్టిన అగ్గిపుల్ల, మధ్యలో వున్న అగ్గి పుల్లను దాటి వచ్చేటట్టు ఒక మడత పెట్టాలి. ఎదుటివైపునుంచి మరో మడత పెట్టాలి. ఇప్పుడు ప్రేక్షకులకు అగ్గిపుల్లను విరవమని ఇవ్వాలి. రుమాలు పక్కన దాచిపెట్టిన అగ్గిపుల్లను వారి చేతి వేళ్లకు అందివ్వాలి. వాళ్లు దాన్ని విరిచేస్తారు. మధ్యలోపెట్టిన అగ్గిపుల్ల భద్రంగా వుంటుంది. చివరిగా రుమాలును మెల్లగా విప్పి చక్కగా వున్న అగ్గిపుల్లను చూపించాలి. అదీ సంగతి.

చుక్కలు కలిపి చూడండి!



కలంస్నేహం



పేరు: కె.నాగార్జున,
వయసు : 14 సం॥
చదువు :9 వతరగతి
హాబీలు :డ్రాయింగ్ వేయడం, క్రికెట్ ఆడడం, చూడడం, టీవీ చూడడం, పుస్తకాలు చదవడం.
పూర్తి చిరునామా : కె.నాగార్జున, వ తరగతి, సన్నాఫ్ బాలయ్య, మేడిపల్లి, ఘట్‌కేసర్, ంగారెడ్డి.

పేరు:గోపాలం నాగశిరీష,
వయసు :12 సం॥
చదువు :7 వతరగతి
హాబీలు: టీవీ చూడడం, ఆదివారం ప్రజాశక్తి పుస్తకం చదవడం, మొక్కలు పెంచడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా :గోపాలం నాగశిరీష, డాటరాఫ్ జి.శంకరరావు, కుంచనపల్లి, తాడేపల్లి, గుంటూరు.

క్విజ్ 59 జవాబులు

1. ఇందిరాగాంధి 2. ఇగ్లూ 3. రాష్ట్రపతి 4. జాన్ మిల్టన్ 5. శాంతి 6. 12 7. కోల్‌కతా 8. ముర 9. 'ఎ' 10. అమితాబ్ బచ్చన్

★

క్విజ్ 58కి సరైన సమాధానాలు రాసిన వారు :

యు.పుల్లారావు, 9వ తరగతి, **జి.వెంకటేశ్వర్లు,** 9వ తరగతి, **వి.యేసేబు,** 9వ తరగతి, జిహెచ్‌హైస్కూల్, యర్రగొండపాలెం, ప్రకాశం. **కె.విమల,** 8వ తరగతి, భద్రాచలం, ఖమ్మం. **టి.యామిని, జి.వందనారాణి, పి.భ్రమర,** 9వ తరగతి, పి.టి.పర్రు, గుంటూరు. **ఎమ్.శైలజ,** 7వ తరగతి, లక్ష్మినగర్, మెదక్. **ఎల్. కోటేశ్వరమ్మ,** 9వ తరగతి, బాపట్ల.

ఈ పతాకం ఎవరిది?

నీలం, తెలుపు అడ్డు చారలు. ఎడమువైపు ఎర్ర త్రికోణం, అందులో తెల్లని నక్షత్రం. ఇది ఏ దేశపు పతాకం?

పిండి బాబు



అనగనగా ఒక ఊళ్లో ఓ అవ్వ, తాత ఉండేవారు. వారికి పిల్లలు లేరు. అందుకని వాళ్లు పిండితో ఒక బాబుని తయారు చేస్తారు. వాడికి పిండిబాబు అని పేరు పెడతారు. వాడు స్కూలుకి వెళతానంటాడు. వాళ్ల తాత, అవ్వ వద్దంటారు. కాని వాడు వినకుండా స్కూలుకు బయలుదేరతాడు. మార్గ మధ్యలో అడవి వస్తుంది. అక్కడ ఒక కోతి వాడి దారికి అడ్డుగా నిలబడి 'నిన్ను తినేస్తాను. నాకు ఆకలిగా వుంది' అంటుంది. అప్పుడు పిండిబాబు 'నేను అవ్వ నుంచి, తాత నుంచి తప్పించుకొచ్చాను. నేను పిండిబాబుని' అని వెళ్లిపోతాడు. అప్పుడు ఏనుగు వస్తుంది. 'నేను నిన్ను తినేస్తాను. నాకు ఆకలిగా వుంది' అంటుంది. అప్పుడు పిండిబాబు 'నేను అవ్వ– తాత నుంచి, కోతి నుంచి తప్పించుకొచ్చాను. నేను పిండిబాబుని' అని వెళ్లిపోతాడు. అప్పుడు జింక వస్తుంది. 'నేను నిన్ను తినేస్తాను' అంటుంది. అప్పుడు పిండిబాబు 'నేను అవ్వనుంచి , తాత నుంచి, కోతి, ఏనుగు నుంచి తప్పించుకొచ్చాను. నేను పిండిబాబుని' అని వెళ్లిపోతాడు. అప్పుడు జిరాఫీ వస్తుంది. అదికూడా పిండిబాబుని తినేస్తానంటుంది. అప్పుడు పిండిబాబు 'నేను అవ్వనుంచి, తాత నుంచి, కోతి నుంచి, ఏనుగు నుంచి, జింక నుంచి తప్పించుకొచ్చాను. నేను పిండిబాబుని' అని వెళ్లిపోతాడు. అప్పుడు సింహం ఎదురు వస్తుంది. 'నాకు ఆకలిగా వుంది. నేను తినేస్తాను' అంటుంది. అప్పుడు పిండిబాబు 'నేను అవ్వ నుంచి, తాత నుంచి, కోతినుంచి, ఏనుగు నుంచి, జింకనుంచి, జిరాఫీ నుంచి తప్పించుకొచ్చాను. నేను పిండిబాబుని' అంటాడు. ఎలాగయితేనేమి పిండిబాబు స్కూలుకు చేరుకుంటాడు. స్కూల్లో పిల్లలంతా 'మేం నిన్ను తినేస్తాం' అంటారు. పాపం! పిండిబాబు ఒక మూల కూర్చొని ఏడుస్తుంటాడు. అప్పుడు వాళ్ల తాత, అవ్వ వస్తారు. వచ్చి స్కూల్లో చేర్పిస్తారు. అప్పుడు స్కూల్ హెడ్‌మాస్టరుగారు పిండిబాబుకు స్కూల్ డ్రస్ కుట్టించమని చెప్తారు. వాళ్ల అవ్వ వాడికి స్కూలు డ్రస్ కుట్టించడానికి టైలర్ దగ్గరకు తీసుకువెళ్తుంది. టైలర్ పిల్లవాడిని చూపించమంటాడు. అప్పుడు పిండిబాబుని చూసి కుట్టలేనంటాడు. ఇంక అవ్వే వాడికి డ్రస్ కుడుతుంది. బూట్లు కొంటారు. అవి వాడికి పెద్దవవుతాయి. అప్పుడు వాళ్ల అవ్వ మళ్లీ వాడికి బూట్లు కుడుతుంది. మరుసటి రోజు ఎట్టకేలకు పిండిబాబు స్కూలుకి వెళతాడు.

తెలకపల్లి ప్రత్యూష, 6వ తరగతి, లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, విజయవాడ. 10.

> **కథ రాయాలనుకుంటున్నారా!**
> **మరి ఆలస్యం ఎందుకు?**
> రాసి పంపిస్తే 'నా కథ' శీర్షికలో ప్రచురిస్తాం. పది వాక్యాలు చాలు. చిన్నప్పటినుంచే రాయడం అలవాటు చేసుకుంటే పెద్దయ్యాక మంచి కథలు రాయగలుగుతారు. మరి మీ కథలకోసం ఎదురుచూస్తూ.....
> బాలనేస్తాలు

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	ణి
	జు
	శి
	కాసి
	గి
	యి

గతవారం జవాబులు

ప	సందు
	ని
	దవి
	ది
	చ్చ
	సరు

హాట్... పాట్... జన్మభూమి

• రుక్మిణి

"వందొమ్మిదో విడత 'జన్మభూమి'కి చాలా ప్రాధాన్యతుంది. ఇది నిరంతర ప్రక్రియ. ఆగేటందుకు వీల్లేదు. జనం భూముల్లో వచ్చిన సమస్యలు ఎన్ని పరిష్కరించాం అన్నది ప్రధానం కాదు.. మన హయాంలో ఎన్ని జన్మభూములు నిర్వహించామన్నదే అసలు ప్రశ్న! దాన్నిబట్టే మన రాష్ట్ర అభివృద్ధిని గ్రేడింగుల్లో నిర్ణయిస్తారు!" చంద్రబాబుగారు చాలా ఆవేశంగా, మిక్కిలి నేర్పుగా ప్రకటించారు.

"మరే రాష్ట్రంలో మన తీరున జనమభూము లెవడూ జరపడం లేదు. హవ్వ... సర్వే చేసిన వాండ్లేమో మనల్ని 12వ స్థానానికే దింపి పారనూకిరి – సార్.. అసలు వాళ్ళు మన జన్మభూమి స్ఫూర్తితో ఈ సర్వే ఇండెక్సులు తయారు చేయలేదు!" ఒక పెద్దమంత్రి విచారంగా అన్నాడు.

"ప్రజల భాగస్వామ్యం ప్రధానమాయె! మరేవో ఆ ఇండెక్సులూ గివీ మన జన్మభూమిలోనే ఏర్పాటు చేసుకుంటే పీడాపాయిరి. మన తడాఖా, మన వీరంగం వాళ్ళకర్థమయితది–!" లొటలొట ఓ యమ్మెల్లే అనడంతో బాబుగారు కుపితుడైనాడు.

"జూన్ ఒకటో తేదీ నుండి పదో తేదీ వరకు 19వ జన్మభూమి జరగాల్సిందే – దానికి తగిన కసరత్తులు చేయండి – ఈసారి మహిళలు... రైతుల సమస్యలపైన జన్మభూమి – ఎవర్నీ వదలకుండా నిలదీయండి... వాళ్ళక్కూడా నిలదీయడం...నిలబడడం నేర్పండి"

వెనగ్గా వున్న ఇద్దరు మంత్రులు శోషలోకి జారిపోయిన వైనం అక్కడి వాళ్ళెవరూ గమనింపలేకపోయిరి – అక్కడున్న వారందరికీ గుండెదడా... వణుకు కూడా మొదలయ్యింది.

''ఇవుడా? జన్మభూమా?'' సీనియరు మంత్రి నోరంతా బార్లా తెరిచాడు.

"అవునయ్యా. నేనవతల గోదావరి పుష్కరాల ఏర్పాటు చూడాలి.. 'వరల్డ్ యూత్ సమ్మిట్' కోసం ప్లానింగు చేసుకోవాలి... తప్పదు.

"అది కాద్సార్.. బయట ఎండలు... జనం పిట్టల్లా ఎగిరి పోతున్నారు. టెంపరేచర్ రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ వాతావరణంలో.. అహ.. అధికార్లు ఊర్లుబట్టి తిరుగుతారనుకోండి.. కాని మళ్ళా వాళ్ళు తిరిగి ఇండ్లకు చేరతారా అనేదే అనుమానం... అహ.. వడగాలి దెబ్బా..."

"ఎండలు ఎప్పుడూ వుండేవే... అసలీ ఎండలే మిమ్మల్ని కాపాడుతాయని తెలియజేసుకుంటున్నాను.... ఎండలోబడి మీరు ఊరూరా తిరిగి ప్రజలు... ముఖ్యంగా మహిళలు... రైతుల సమస్యలు తెలుసుకుంటే వాళ్ళకు కాస్తంత ఊరట కలుగుతుంది"

"తెలుసుకోడానికేం... అది కాదు... అసలుజనం యాడ్నుంచి వస్తారని... కరువు దెబ్బకు పట్నాలకు పరారైపోయిరి. నిక్కినీలిగితే మన పచ్చ చొక్కాల గుంపే అయిదారుగురు పోగయి ఏం లాభం?" మరో యువ మంత్రి మెలిక తిప్పుడు ప్రశ్న సంధించాడు.

"అంతేగాక ఇటు ప్రకృతి ఎండదెబ్బా... కాక... అవతల జనం కూడా మహామంట మీదున్నారని రిపోర్టులు... ఇండెక్సులూ తెలుపుతున్నాయి – మీరు ఇంటర్నెట్‌లో పరిశీలించండి..."!

చంద్రబాబుగారు లటలట లాప్‌టాప్ మీటలు నొక్కాడు "మంచినీళ్ళకోసం మహిళలు... మైళ్ళ కొద్దీ కడివెడు నీళ్ళకోసం ఎండలో గంటలు గంటలు... వెంపర్లాట... దాని టెంపరేచరు 60 డిగ్రీలు" (ఆహా.. ఐ.టి. పరిజ్ఞానం ఇప్పుడు కళ్ళు తెరిపిస్తుంది గదా...ఓహో)

"ఏం ఫర్వాలేదు... 'జలచైతన్యం' ఫలితంగా ఇంటింటికీ ధారగా నీళ్ళు ఊటగా వచ్చే పథకాలు సిద్ధమవుతున్నాయని చెప్పండి!"

మంత్రులూ... యమ్మెల్లేల గుండెల్లో గుబులు మొదలయింది – ఇలాంటి పనికిమాలిన పిచ్చికూతలు చాలాసార్లు కూశాం... వీళ్ళు నమ్మరు గాక నమ్మరు.

బాబుగారు లటలటమనిపించారు. "రైతులు పైర్లు.. యవసాయం లేక తిండి దొరక్క అల్లాడుతున్నారు. కూలికూడా దొరకడం లేదు – ఆకలి చావులు చస్తున్నారు – ఏ ప్రాజెక్టూ పూర్తిగాక సాగునీటి కోసం విలవిల్లాడుతున్నారు. వారి మంటా– వేడి 80 డిగ్రీలు..

మరో మంత్రి తడాల్మని విరుచుకుపడిపోయాడు.

"అరే.. అవతల మనం రెండు మూడు నెలల్లో గంగా–కావేరీ నదులను కలిపి పారేసి లక్షల ఎకరాలకు నీరందించబోతున్నాం – ఏం ఢోకాలేదు – 'వచ్చే–వచ్చే' అని వాగ్దానాలు చేయండి... అవతల రేపోమాపో దేవాదుల పూర్తయిపోయింది గదా!"

ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికెగిరిందట... జనం చెవుల్లో పూలు పెట్టుకుని లేరు – ఇలాంటి కూతలు కూస్తే వాండ్ల టెంపరేచరు మరికాసంత పెరుగుతుంది – లబోదిబోమని తలలు బాదుకున్నారు.

బాబుగారు లటలట మని మీటలు నొక్కుపారేశాడు.

"కరువు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోని ప్రభుత్వం... కేంద్రం ఇచ్చిన పనికి ఆహారం బియ్యం కూడా గోడౌన్లో మూలుగుతున్నాయి – పని కల్పించే ప్రయత్నం లేదు – వ్యవసాయ కార్మికులు... మహిళలు.. పొట్టగడవడానికి కరువు పనుల కోసం... మటమటలాడి పోతున్నారు – వారి టెంపరేటరు 85 డిగ్రీలు..

"వంద శాతం కూలిరేటు పెంచాం గదా! మరింకేం ఇబ్బంది" బాబుగారు ఎగిరెగిరి పడ్డారు..

"కానీ మన పచ్చ పార్టీ నాయకులు గట్లాంటి పన్లంటినీ ప్రాక్లెను... ఇతర మిషన్లతోనే చేసి పారేస్తండ్రు.. అస్సలు కూలీల్నీ దగ్గరకు రానీటం లేదాయె!" ప్రాక్లెన్లు లేని మంత్రి తన అక్కసునంతా వెళ్ళగక్కాడు.

బయట ఎండ మలమల మాడ్చి పారేస్తుంది. వేడిగాలి చండప్రచండంగా వుండి ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఉస్సురని నిట్టూర్చి బాబుగారు లటలటమని మీటలు నొక్కాడు.

"అటు పాదయాత్రలు.. వామపక్షాల కలక్టరేట్ల దిగ్బంధనం.. పికెటింగ్‌లు.. సార్వత్రిక బందూ... రాజకీయం ఎండకన్నా బాగా వేడెక్కుతుంది. సలసల కాగిపోతుంది. దాని టెంపరేటరు సెంట్ పర్సెంట్ – దాని చేతగాని బడితేభస్మం!"

బాబుగారు హతాశుడై అందరి వంకా చూశాడు. అందరూ బిక్కుబిక్కుమని గుండెలు చేతపట్టుకుని బయట ఎండ వంకా... బాబుగారి వంకా మిటుకూ మిటుకూ చూస్తున్నారు.

"అంతా రాజకీయం... ఈ మండే ఎండను కూడా ప్రతిపక్షాలు 'రాజకీయం' చేసి పారేస్తున్నాయి – ప్రకృతిని కూడా... అబ్బో... దీనికి విరుగుడు – మనమూ మన రాజకీయం చేద్దాం... ఒక తడవ వానో... దయతలచి తుఫానో వచ్చి చల్లబడ్డాకనే మళ్ళీ జన్మభూమి...!"

మంత్రులూ... ఎమ్మెల్లేలు బతుకుజీవుడా అని సంబరపడిపోయినారు!

◆

ప్రోత్సాహం కావాలి!

ఒక మంచి మాట-
మనసుకు హాయిగా వుంటుంది!
గొప్ప ఉత్సాహంగా ఉంటుంది!
పరవశం కలుగుతుంది!
ఒక మంచి ప్రోత్సాహం-
టానిక్కులాగా పని చేస్తుంది!
వెయ్యి ఏనుగుల బలాన్నిస్తుంది!
అసాధ్యాన్ని సాధ్యం చేస్తుంది!
ఒక మంచి నమ్మకం -
ధైర్యాన్ని పెంచుతుంది!
కొండల్ని పిండిచేస్తుంది!

అందుకే కవిగారన్నారు. నాక్కొంచెం నమ్మకమివ్వు - కొండల్ని పిండి చేస్తాను అని! అంచేత లోకకళ్యాణం జరగాలనుకుంటే - కొన్ని మంచి మాటలు వినాలి. గొప్ప ప్రోత్సాహం పొందాలి. అపారమైన నమ్మకం కలగాలి. ఇవన్నీ మనకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటే ఘనకార్యాలు సాధిస్తాం. కీర్తి పతాకం ఎగరేస్తాం!

అంతేగాని -

నువ్వేం చేస్తావ్ నీ బొంద అని దీవిస్తుంటే పనులేం జరుగుతాయి? అవును కాబోననే డవుటు కలుగుతుంది. నీరసం తగులుకుంటుంది. నిరుత్సాహం పేట్రేగిపోతుంది. దానాదీనా ముసుగెట్టి తొంగోడం తప్ప ఎంత మనిషైనా ఏమీ చేయలేడు!

ఆంజనేయులంతటి వాడు - సముద్రాలు దాటగల శక్తి వుండి కూడా - నా వల్ల కాదేమోనని డవుటు పెట్టుకున్నాడు. ఆ మహానుభావుడ్ని అట్లా వదిలేస్తే లోకకళ్యాణం జరగదని పెద్దలు గ్రహించేరు! ఆంజనేయుల్ని ఉత్సాహపరిచే కార్యక్రమం తలపెట్టేరు. జయహో వీర హనుమాన్ అని నినాదాలు చేసేరు. అంతటివాడివి ఇంతటి వాడివని పద్యాలు చదివేరు. ఎగిరి చూడు లంకలో వుంటావని గట్టినమ్మకమిచ్చేరు! దాంతో ఆంజనేయస్వామి పొంగి పోయేడు. రామచంద్ర ప్రభో అని గాల్లో లేచేడు. ఆ లేవడం లేవడం లంకలో కాలు పెట్టేడు!

ఏతావాతా -

ఒరిజనల్‌గా వున్న శక్తి సంపద కంటే - ఆ శక్తి సంపదను ఎప్పటికప్పుడు గుర్తు చేసే సదుపాయం వున్నప్పుడే - నేనైనా, మీరైనా కొన్ని ఘన కార్యాలు చేయగలుగుతాం! ఇంతో అంతో కీర్తి గడించగలుగుతాం. అంతే తప్ప - నీ వల్ల జరిగే పని కాదు సుమా - అంచేత తిని తొంగోమని దీవిస్తే మీరైనా, నేనైనా మంచమెక్కుతాం! మొహం నిండా దుప్పటి లాక్కుని అందులో దాక్కుంటాం! ఇది రూలు. లోకనీతి!

అంతెందుకు -

అంతటి వీరాంజనేయుల్ని పట్టుకుని సప్తసముద్రాలు దాటడం నీ తరం కాదుగానీ భజన చేస్తూ కూచోమని అందరూ ఒకేమాట కూసి వుంటే - ఆ స్వామి సైడు కాలువ కూడా దాటే వాడు కాదు! ఇంతకీ తమకి మనవి చేసేదేమిటంటే - ఆఫీసులో మగమారాజు ఏం చక్రం తిప్పుతున్నాడో వదిలేయండి. ఇల్లు అనే సామ్రాజ్యాన్ని ఎంతో శ్రద్ధగా, ఎంతో చాకచక్యంగా, నేర్పుగా, ఓర్పుగా చక్కదిద్దే ఇల్లాలిని సదరు భర్త మెచ్చుకోవాలి! అతను ఆఫీసులో రాసే రొటీను ఫైళ్ల కంటే - అతని అర్థాంగి ఇల్లు చక్కదిద్దే కార్యక్రమానికి విలువెక్కువని గమనించాలి. ఈ రూలుకు వ్యతిరేకంగా అతడు ఆమెను ఆఫ్టరాల్‌గా చూడటం అనాదిగా వస్తున్న ఆచారమైపోయింది!

ఆమె బంగాళాదుంపల వేపుడు బ్రహ్మాండంగా చేయగలదు. బావుందని భర్త మహాశయుడు నిజాన్ని ఒప్పేసుకుని ఒక చిన్న కాంప్లిమెంటు పారేస్తే - ఆమె మరింత అద్భుతంగా వండిపెట్టగలదు. కానీ సదరు భర్త చచ్చినా మెచ్చుకోడు! భార్యని మెచ్చుకోడం పరమ బేవార్సు ప్రోగ్రామని అతని అభిప్రాయం. అంచేత ఆమె వడ్డించిన పదార్థాలను లొట్టలేసుకుని నుష్టుగా భోంచేసి కూడా - ఉప్పెక్కువ తగలేసేవని విసుక్కుంటాడు. అక్కడ్తో ఆగిపోకుండా ఆమె వంశాన్ని కూడా ముగ్గులోకి లాక్కువస్తాడు!

మీ ఇంటో - మీ అమ్మగార్తో సహా - మీ అక్క చెల్లెళ్లెవ్వరికీ వంట చేయడం చేతకాదని వంకపెడతాడు. మీతల్లి తండ్రులే మిమ్మల్నిట్లా తీర్చిదిద్దేరని చురక వేస్తాడు. ఆ పాపిష్టి మాటల్తో ఆమె మనసు గాయపడుతుంది! గొప్ప నిరుత్సాహ పడిపోతుంది. ఆ దెబ్బతో పాకశాస్త్రం మొత్తం మరిచిపోతుంది. ఒక్క వంట విషయమే కాదు - అతను పెట్టే వంకల్తో చక్కగా పాడే గొంతు మూగబోతుంది. ఆమె నాట్యవిన్యాసం తప్పటడుగుల్తో తడబడుతుంది. పెళ్ళికి ముందు ఆమె ప్రతిభను మెచ్చుకున్న కుర్రాడు - పెళ్లయ్యేక - భర్త హోదాలో చాల్లే సంబడమని ఆమె ఆర్టుమీద నీళ్లు పోస్తాడు. ఏతావాతా భర్త రూపంలో ఆమె ప్రతిభకి స్పీడు బ్రేకరవుతాడు. ఆమెను వంటగదికి అంకితం చేసింది చాలక - ఆమె వంటకు కొన్ని వంకలు పెడుతుంటాడు. ఇది సత్యం! ◆

* రాకెట్లవీరన్న

పాండురంగని ఆలయం

పరవశింప చేసే పండరీపురం

చంద్రభాగ నదీతీరాన వెలసిన 'పండరీపుర' క్షేత్రం పర్యాటకుల్ని పరవశుల్ని చేస్తున్నది. నిత్యం అన్నదాన కార్యక్రమాలతో విలసిల్లే ఈ ప్రదేశం (దేవాలయానికి) ఏ కాలంలో చూసినా భక్తులు, సందర్శకులతో కిటకిలాడుతుంటుంది. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు దేవాలయం దగ్గర అన్ని సదుపాయాలున్నాయి. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో ఈ క్షేత్రం ఉంది. జిల్లా కేంద్రమైన సోలాపూర్‌నుండి ఇక్కడికి చక్కటి బస్సు సౌకర్యం ఉంది.

భక్తులు 'చంద్రభాగ' నదిలో స్నానాలు చేసి దర్శనానికి వెళ్తారు. ఈ నదిలో ఉన్న బోటింగ్ పర్యాటకులకు ఎంతో ఆహ్లాదాన్ని, ఆనందాన్నిస్తుంది. బోటింగ్ చేస్తున్నప్పుడు పిల్లల ఆనందానికి హద్దే ఉండదు. విశాలమైన నదీతీరాన వెలసిన 'పాండురంగని' దేవాలయం శోభాయమానం. ఈయన్ని రుక్మిణీ సమేత పాండురంగడు అని కూడా అంటారు. ఈయన స్వయంభూ విఠలాచార్యుడు.

రాష్ట్ర కూటరాజులు (అవిధేయ మహారాజు) క్రీ.శ. 516లో ఈ దేవాలయాన్ని నిర్మించినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తుంది. నల్లటి రాళ్ళతో అద్భుతంగా ఈ దేవాలయాన్ని నిర్మించారు. రాష్ట్ర కూటులచే ఎంతో సుందరంగా నిర్మించిన ఈ దేవాలయం పర్యాటకుల్ని ఇట్టే ఆకర్షిస్తోంది. చూడటానికి చాలా పురాతనంగా ఈ పట్టణం కనిపిస్తుంది. ఇక్కడికి సుదూర ప్రాంతాల నుండి అనునిత్యం పర్యాటకులు వస్తుంటారు. అయినప్పటికీ ఇక్కడి ప్రజలు మాత్రం నాగరికతకు కాస్త దూరంగానే ఉంటారు. తలపాగాలు, టోపీలు ధరించి, తెల్లటి వస్త్రాలు ఎక్కువగా వేసుకుంటారు.

ఇక్కడ కోలాటం, చెక్క భజనతో పాండురంగని కొలుస్తూ పాడే పాటలు సందర్శకులను అడుగు ముందుకు వేయనీయవు. పది నుంచి పదిహేనేళ్ళ పిల్లలు గుండ్రంగా నిల్చొని, వంగి లేస్తూ, లయబద్ధంగా పాండురంగని సేవిస్తూ పాడే పాటలు ప్రేక్షకుల్ని మైమరపిస్తాయి. 'జాయింగే హమ్ పండరి పురికీ జాయింగే' 'పాండురంగ విఠల పండరినాథ విఠల' అంటూ మరాఠీలో పాడే పాటలు ఎంతో వినోదాన్నిస్తాయి. ముఖ్యంగా ఇక్కడ చూడదగిన మరొక ప్రదేశం కైకాడ్ మహారాజ్‌మఠం. దీనిని పద్మవ్యూహం అని కూడా పిలుస్తారు. క్రీ.శ. 13వ శతాబ్దంలో ఇక్కడ కైకాడ్ మహారాజ్ సమాధి నిర్మించారు. అందుచేత దీనిని కైకాడ్ మహారాజ్ మఠం అంటారు. ఈ మఠాన్ని ఇక్కడికొచ్చిన ప్రతి ఒక్కరూ సందర్శిస్తారు. ఈయన ఈ పురాన్ని పరిపాలించిన మహారాజు.

చరిత్ర తెలిపే కైకాడ్ మహారాజ్ మఠం :

పండరీ పురానికి వచ్చిన ప్రతి సందర్శకుడూ ఈ మఠాన్ని చూడనిదే తిరిగి వెళ్ళడు అంటే అతి శయోక్తికాదు. పురాతన కాలంలో నిర్మించినదైనప్పటికీ నేటి ఆధునిక వాస్తుకళకు ధీటుగా దీన్ని నిర్మించారు. ప్రవేశ ద్వారంలో అడుగు పెట్టిన దగ్గర నుండి బయటికి వచ్చేందుకు దాదాపు రెండు గంటల సేపు పడుతుంది. ఇంతసేపు ఎటుపోతున్నామో తెలియదు. వెళ్తున్నప్పుడు పామునోట్లోను, ట్రైన్‌లోను, మొసలి, గ్రద్ద, తదితర జీవరాశుల ఆకారాల్లో వెళ్తాము. ఆ సమయంలో పిల్లలు, పెద్దల ఆనందానికి హద్దే లేదు. అంతేకాక వాటి లోపల ఏర్పాటు చేసిన మ్యూజియం చరిత్రను కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది.

ఆది మానవుడి నుండి నేటి రాకెట్ లాంచర్ల దాకా మానవుడు ఎదిగిన క్రమాన్ని ఇక్కడ శిల్పాకృతిలో (బొమ్మలు) ఏర్పాటు చేశారు. ఆదిమ మానవుడు, అత్రి మహర్షి, వశిష్ట మహాముని, పాండవ, అగస్త్య, దుర్వాస, తుంబుర, భక్త మార్కండేయ, శంకరాచార్య, హరిశ్చంద్ర, మయూరధ్వజ, భక్తసిరియాళ, నలగామరాజు, జనకమహారాజు, భక్త ప్రహ్లాద, వ్యాసుడు, బుద్ధుడు, మహారాణాప్రతాప్, ఛత్రపతి శివాజీ, ఝాన్సీ లక్ష్మీబాయి, బ్రిటీష్ పరిపాలన మొదలు మన రాజ్యాంగ ఆవిర్భావం, పార్లమెంట్ వరకూ ప్రతి విషయాన్ని కళ్ళకు కట్టినట్లు తెలుపుతుంది. ఇందులో తిరుగుతుంటే చరిత్ర తెలుసుకుంటూ మనల్ని మనమే మరచిపోతాము.

రాముడు, పాండువులు చేసిన అశ్వమేధ యాగం, అశోకుని కళింగ యుద్ధం జరిగిన తీరు ఆ శిల్పాలలో జీవం పోసుకుంది. ప్రస్తుతం మనముందు యుద్ధం జరుగుతోందా అన్న రీతిలో బొమ్మలున్నాయి. భారత సైన్యం (అజాద్ హింద్ ఫౌజ్ సేన) మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న దృశ్యం వర్ణనాతీతం.

శాంతి ధ్యానేశ్వర్, భక్త కబీర్, వివేకానంద, రామకృష్ణపరమహంస, జమదగ్ని, పరశురాముడు, పురాతన కవుల చరిత్రతో పాటు వారి రూపాలను చూడవచ్చు. ఈమఠం వినోదాన్నే కాదు ఎంతో విజ్ఞానాన్ని కూడా ఇస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ భవనాన్ని నిర్మించిన పురాతన వాస్తు శిల్పిని అభినందించాల్సిందే.

మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో ఈ క్షేత్రం ఉంది. సోలాపూర్ జిల్లా కేంద్రం నుంచి నిత్యం బస్సులు పండరీపురానికి తిరుగుతాయి. సోలాపూర్ నుండి 25 రూపాయలతో పండరీపురం చేరవచ్చు. పండరీపురానికి సమీప రైల్వే జంక్షన్ సోలాపూర్. ఏదేమైనా వినోద, విహార యాత్రాస్థలమైన పండరీ పురాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించాల్సిందే. ◆



కైకాడ్ మహారాజ్ మఠం

సూపర్ కిడ్ సహజ్

*షాహిన్ సుల్తానా

ఆసియా అండర్-10 ఛాంపియన్ పరిమార్జన్ నేగితో సహజ్ (ఎడమ)

ప్రత్యేక శిక్షణా సౌకర్యాలు లేకున్నా భారత్‌లో చెస్ ఆటగాళ్లు దినదినాభివృద్ధి చెందుతున్నారు. ఢిల్లీకి చెందిన తానియా సచ్‌దేవ్ కొద్దిరోజుల క్రితం ఆసియా అండర్-10 బాలికల ఛాంపియన్‌గా అవతరించింది. ఇప్పుడు ఢిల్లీకే చెందిన ఏడేళ్ల సహజ్ గ్రోవర్ జాతీయ అండర్-7 ఛాంపియన్‌గా నిలిచాడు. ఫైడ్ తాజా నివేదిక ప్రకారం సహజ్ ఇంటర్నేషనల్ రేటింగ్ సాధించిన అతిపిన్న వయస్సుగల భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. న్యూఢిల్లీలో ఫిబ్రవరిలో జరిగిన రాజీవ్ గాంధి ఇంటర్నేషనల్ రేటింగ్ రౌండ్ రాబిన్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబర్చిన సహజ్ 1944 ఎలో పాయింట్లు సాధించాడు. ఆ సమయంలో అతని వయస్సు ఏడు సంవత్సరాల ఐదు నెలలు మాత్రమే. ఎలో రేటింగ్ సాధించిన ఆటగాళ్లలో ప్రపంచంలోనే అతిపిన్న వయస్కుడిగా కూడా సహజ్ రికార్డు నెలకొల్పినట్లు కనిపిస్తోంది. ఈ విషయాన్ని ప్రపంచ చెస్ అసోసియేషన్ 'ఫైడ్' పరిశీలిస్తోంది.

సాధారణంగా చెస్ ఆడే పిల్లలు సాధారణ పిల్లలకంటే ప్రత్యేకంగా ఉంటారు. వారు గంభీరంగా, మూడీగా ఉంటూ, ఏకాంతంగా గడిపేందుకు ఎక్కువ ఇష్టపడతారు. కానీ సహజ్ వీళ్లందరికంటే భిన్నమైన మనస్తత్వాన్ని కలిగి ఉన్నాడు. అతను తన అన్నయ్య నామన్‌తో గిల్లికజ్జాలు పెట్టుకుంటూ ఉంటాడు. 'ఇచ్చినవన్నీ తింటూ' తన తల్లిని సంతోషపరుస్తూ ఉంటాడు. స్కూల్లో టీచర్లతో సన్నిహితంగా ఉండే సహజ్‌కు గణిత శాస్త్రం అంటే అమిత ఇష్టం. అన్నిటికంటే ప్రధానమైనది అతని ముందు చెస్‌బోర్డు పెడ్తే ఏకబిగిన ఏడెనిమిది గంటలు విసుగులేకుండా కూర్చుంటాడు. చెస్‌లో సహజ్ జైత్రయాత్ర మూడున్నర ఏళ్ల వయస్సు నుండే ప్రారంభమైంది. తన జన్మదినం రోజున తండ్రి విజయ్ బహూకరించిన చెస్ బోర్డుపై సహజ్ తన సోదరుడు నామన్ నుండి ఓనమాలు నేర్చుకున్నాడు. క్రమంగా చెస్‌పై సహజ్‌కు ఆసక్తి పెరిగింది. దీంతో అతని తండ్రి తర్ఫీదు ఇచ్చాడు. తండ్రినే ఓడించిన సహజ్ ఐదేళ్లు నిండకుండానే స్థానిక పోటీల్లో మూడో బహుమతి గెల్చుకున్నాడు.

పిన్నవయస్సులోనే సంచలనాల పర్వం

తానియా సచ్‌దేవ్‌కు శిక్షణ ఇచ్చిన కె.సి.జోషి ప్రోత్సాహంతో సహజ్ చెస్‌పై పట్టు సంపాదించాడు. జోషి సహకారంతో ఢిల్లీ రాష్ట్ర అండర్-19 ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని అద్భుత ప్రతిభ కనబర్చాడు. ఆ టోర్నీలో ఒక మ్యాచ్‌లో విజయం, రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకోవడంతో చెస్‌పై సహజ్‌కు ఆసక్తి మరింత పెరిగింది. వెంటనే అతన్ని తండ్రి బాట్వినిక్ చెస్ అకాడమీలో చేర్పించాడు. అక్కడ వెటరన్ సి.యస్బీర్ శర్మ, కోచ్ కరుణ్ దుగ్గల్ శిక్షణలో రాటుదేలాడు. ఒక మ్యాచ్‌లో తన రాణిని సహజ్ కట్టడి చేయడంతో 12వ ఎత్తులోనే ఓటమి అంగీకరించాల్సి వచ్చిన సంఘటన శర్మను ముగ్ధుడ్ని చేసింది. దీంతో సహజ్‌కు శర్మ మ్యాగ్నెటిక్ చెస్ బోర్డు బహూకరించాడు. గత సంవత్సరం సాంగ్లీలో జరిగిన ఒక ఏజ్-గ్రూప్ టోర్నమెంట్‌లో వంద మందికిపైగా పాల్గొనగా సహజ్ ఏడో స్థానంలో నిలిచాడు. అయితే 2002లో జరిగిన బ్రిటిష్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-8, అండర్-10 విభాగాల్లో రజత పతకం సాధించడంతో అతనిలో ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. ఒక దశలో అండర్-11 ఛాంపియన్‌ను కూడా ఓడించే స్థాయికి వెళ్లాడు. బ్రిటిష్ ఛాంపియన్‌షిప్-2001లో పాల్గొన్న అతిపిన్న వయస్సుగల ఆటగాడిగా ఐదేళ్ల సహజ్ మరో రికార్డు నెలకొల్పాడు. సహజ్‌కు తాను చదివే కులాచి హంస్‌రాజ్ మోడల్ స్కూల్ యాజమాన్యం ఆర్థికంగా మంచి సహకారం అందించింది. తన స్టార్ ఆటగాడు విదేశీ టోర్నమెంట్లలో పాల్గొనేందుకు అవసరమైన 75 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడంతో పాటు ఒక సభ ఏర్పాటు చేసిన స్కూల్ యాజమాన్యం సహజ్‌ను ఘనంగా సన్మానించింది. జి.బి. జోషి నుండి ప్రారంభంలో శిక్షణ పొందిన సహజ్ ఇప్పుడు జాతీయ జూనియర్ మాజీ ఛాంపియన్ గుర్‌ప్రీత్ పాల్ సింగ్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. అతనికి తన పాఠశాల ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రముఖుల నుండి మంచి ప్రోత్సాహం లభిస్తోంది. సహజ్‌కు అవసరమైన సలహాలను, సూచనలను గుర్‌ప్రీత్ ఇస్తున్నాడు. గుర్‌ప్రీత్ 'సర్' విలువైన సూచనలను సహజ్ గురితప్పకుండా ఫాలో అవుతాడు. రాజీవ్ గాంధి స్మారక టోర్నమెంట్‌లో సహజ్ ధాటికి బలైన వాళ్లలో గుర్‌ప్రీత్ కూడా ఒకడు కావడం గమనార్హం. బాల మేధావి సహజ్ అద్వితీయ ప్రతిభ కనబరుస్తూ ఆటను తనకు అనుకూలంగా మార్చుకునే పద్ధతిని చూసిన గుర్‌ప్రీత్ ప్రశంసల వర్షం కురిపించాడు. గత సంవత్సరం జలంధర్‌లో జరిగిన జాతీయ-బి ఛాంపియన్‌షిప్‌లో సహజ్ ఖాతా తెరవడానికి కొన్ని రౌండ్లపాటు వేచి ఉన్నాడు. అయితే టోర్నీ రెండో దశలో అతను విజృంభించి అనుభవజ్ఞులైన ప్రత్యర్థులపై సాధించిన విజయాలు ముచ్చటగొలిపాయి. ఈ టోర్నీలో 250 మందికిపైగా పాల్గొన్న వాళ్లలో అతిపిన్న వయస్సు గల ఆటగాడిగా నిర్వాహకులు సహజ్‌కు ప్రత్యేక బహుమతి ప్రదానం చేశారు. అప్పుడు "నేను ఈ టోర్నీలో ప్రత్యేకంగా ఏమీ సాధించలేదు. అయినా ఈ ప్రైజ్ ఎందుకు ఇస్తున్నారు?" అని సహజ్ ప్రశ్నించాడు. ఈ చిన్న వయస్సులోనే బహుమతి అందుకోవడానికి తాను చేయాల్సిన పనేంటో తెలుసుకోగలిగిన బాల మేధావి ఇతను.

ప్రభుత్వ ప్రోత్సాహానికై ఎదురుచూపు

సహజ ప్రతిభ కలిగిన సహజ్‌కు సరైన శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే ప్రపంచంలోనే ఉత్తమ చెస్ ఆటగాడిగా ఎదుగుతాడని అతని తండ్రి విజయ్ అంటున్నాడు. అయితే బట్టల వ్యాపారం చేసే విజయ్ ఆశలకు ఆర్థిక బాధలు అడ్డంకిగా నిలిచాయి. తన కుమారుడిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ముందుకు వచ్చి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని అతను కోరుతున్నాడు. "సహజ్ కోచింగ్, రవాణా తదితర ఖర్చులు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం కానీ, కార్పొరేట్ సంస్థలు కానీ ముందుకొచ్చి ఖర్చులను భరిస్తే అతన్ని ఉత్తమ ఆటగాడిగా తీర్చిదిద్దుతాను" అని విజయ్ అన్నాడు. సరైన ప్రోత్సాహం, శిక్షణ ఇస్తే ఈ చిచ్చర పిడుగు ప్రపంచ ఉత్తమ చెస్ మేధావిగా అవతరిస్తాడనడంలో సందేహం లేదు. ◆

✻ టి.రామిరెడ్డి

జీవకారుణ్యారణ్యం

జడ్జి మార్తాండంగారి 'సహజంగానే సహనశీలి' అనే పేరుంది. చిన్నతనంలో చదువుకున్న గౌతమ బుద్ధుడి శాంతివచనాల పట్టీ వంట పట్టించుకోకున్నా... శివమెత్తి తాండవం చేయడంలోని చిక్కులు లాయరు ప్రాక్టీసు నుండే బాగా ఎరిగి వుండినందువల్లనైతేనేమీ.. అంచెలంచెలుగా ఎదగడానికి 'శాంతి' ముసుగు అవసరం ముందు రోజుల్లోనే గుర్తించి దాన్ని తొడిగేసుకున్నాడు - అట్లా ప్రతిదానికీ మెచ్చుకోలు నవ్వా - నోరు బార్లా తెరిచి నవ్వడంతో మొహంలో సగానికెక్కువ భాగం నోరే విస్తరించి అది అతనికి బాగా ఉపయోగపడింది.

ముద్దాయికి చిరునవ్వుతో మరణశిక్ష విధిస్తున్నపుడు కూడా అచ్చువేణుగోపాలస్వామి గుళ్ళో ప్రసారం కొబ్బరి ముక్కలు పంచే అయ్యవారి లాగానే బెల్లం చేతిలో పెట్టి చేతులు దులిపేసుకుంటాడు.

అందుకే అతనంటే అందరూ దడుచుకుని చస్తారు. ఎందుకంటే ఎపుడూ తెరిచి వుంచే మొహంలో ఏముందో కనిపెట్టడం ఎవుడి తరమూ కాదు.

మార్తాండం గారి ఫ్లాష్‌బ్యాకులో వారి సతీమణిగారు ఏ కారణం వల్ల అకాలం చేసిందో ఎవరికీ అసలవసరం లేని ప్రశ్న. వారికి సంతానం కూడా లేకపోవడం... దానికి వారు పరస్పరం ఒకర్నొకరు గుంభనగా నిందించుకోవడం అప్రస్తుతం అయితే ఆవిడగారు తన దారిన తాను పోయిం తర్వాత మార్తాండం గారిలోని 'లాజిక్కు' 'లా' పుస్తకాలలోని మాజిక్కూ వారిని నిలవనీయకపోవడం ఒక భాగం. అక్కడెక్కడో మారుమూల చిన్నకోర్టులో జడ్జి ప్రమోషను రాంగానే ఈ 'లాజిక్ రహస్యం' మరింత జటిలమై... తన్ను 'అపుత్రస్య గతిర్నాస్తి' అన్న భావనే భయంకరంగా వేధించడం వల్లనైతేనేమి తప్పని పరిస్థితుల కారణంగా మరకతం మలయమారుతంగా వారి లాజిక్కు విప్పే విదుషిణీమణిలా ప్రవేశించడంలోనే మార్తాండం గారి జీవితం అతి పెద్ద మరో మలుపు - సెప్టెంబరు పదకొండు నాటి సంఘటనల దెబ్బలా తిరిగిపోయింది.

అది ఎట్లనిన -

మరకతానికి వెనకా ముందూ ఎవరూ లేకపోయినా.. ఆవిడ కమ్మెచ్చుట దీసిన చేతుల కండరాల వాటం పటిమను అతి తక్కువగా అంచనా వేసి, వాటి నునుపులోనే 'సౌందర్య భావన' దాగుందనే 'మిస్ జడ్జిమెంటు'లో మార్తాండంగారు దారుణంగా మోసపోయాడనే చెప్పాలి!

మరకతం మాట మలయమారుతంలా...నాజూగ్గా వున్నా చేతిదెబ్బ వాటం మాత్రం పరమ మొరటుగా వుండి... అది పురుషాధిక్య భావజాలాన్ని సమూలంగా కుదుళ్ళ నుండే వణికింప జేస్తుంది.

ఈ పరమ 'పచ్చి' రహస్యం మొదటి రాత్రి మార్తాండం అనుభవంలోకి అట్లా కుందా పోట్లతో... మోచేతి కుమ్మలతో రుచిలోకి రావడంతో... రాత్రంతా నిద్రలేమితో.. ఒళ్ళు నొప్పులతో, తలపట్టుకుని తెల్లారేసరికి లంఖనాలు చేసిన నీరస రోగిలా పదే... పదే రహస్యంగా తలబాదుకున్నారు. అట్లా ఆధిపత్య స్థానంలోకి మరకతం ఎక్కి కూలబడే సరికి - మార్తాండం 'లా-జిక్కు' 'లావొక్కింతయులేదు...' పద్యానికి తగులుకుని - వైరాగ్యం పట్ల కాసేపు అనురక్తీ... వెనువెంటనే మరకతం చూపుల మహిమ వల్ల అవన్నీ పటాపంచలై కట్టుపంచె సవరించుకునే వరకూ జరిగిపోయాయి!

అయితే వుండుండి మార్తాండం ఆ బొజ్జ గణపతయ్యకు పరమ భక్తాగ్రేసరునిగా మారిపోవడం చాలా మందిని ఆశ్చర్యంలో ముంచి వేసింది. అయితే అందులో అసలు రహస్యం ఏమిటంటే... మార్తాండం అరమోడ్పు కళ్ళతో అరవిచ్చిన పెదాల తంపులతో మనసారా కొలిచేది గణపతిగారి బొజ్జనూ కాదు...తొండాన్నీ ఏకదంతాన్నీ ఎంతమాత్రం కానేకాదు. ఓ మూలన గణపతిగారి బొజ్జ నీడలో ఒద్దికగా ఒదిగి కూర్చుని కళ్ళు మిటకరిస్తూ, తోక రిక్కరించే మూషిక వాహనంగార్నీ అంటే మనం తెల్లబోక తప్పదు.

దీనికి చాలా బలమైన కారణం వుంది-

ఓ శుభోదయాన మార్తాండంగారు పిడుగుపాటు పడిందో... మైక్‌టైసన్ ముష్టిఘాతం ముక్కును పగలేసిందో గానీ అఘాటున వెల్లకిలా విరుచుకుపడిపోయాడు. మీదికి చూస్తే మేరు పర్వతంలా మరకతం... గజ గజ పండుటాకులా ఒణికిపోతుంటే మార్తాండానికి గిలిగింతలు గానే వున్నా బరువుకు పచ్చడైపోతానేమోనని హడలి చస్తూనే వున్నాడు.

"హయ్యో... హదీ... అదీ... (కెవ్వు) అదంటే నా ప్రాణాలెల్లిపోతాయి.... వామ్మ... హాఁ... యాఖ్...!" మరకతం కేకలకు అట్లా జరిగి 'పోయినా' బాగుందుగదా! అని మధన పడుతూనే మరకతం కండరాల సందుల్లోంచి మెడకాస్త రిక్కరించి చూశాడు.

అరె! వేలెడంతలేని ఎలకపిల్ల స్టీలు గిన్నె మీద దాష్టీగా పీఠం వేసి వెక్కిరిస్తుంది. తోక నిక్కబొడిచి మీసాలు తాటిస్తుంది. హత్తెరి! అదన్నమాట అసలు సంగతి! అండప్రచండ పరమపాపి ఫకీరు ప్రాణాలు చిలకలో ఉన్నట్లు మరకతం 'మీట' మూషికం గారిలో వుందన్నమాట! హమ్మయ్య... ప్రపంచంలో ఎలకో... చిలకో... మరకతాన్ని మరతిప్పి కంట్రోలు చేసే ఆదిశక్తో... పరాశక్తో... ఒకటేడ్చిందన్న మాట! చాలా బాగుంది!

అదుగో... అప్పట్నుంచీ మార్తాండం మూషికంగారి భక్త బృందంలో అగ్రపీఠాన్ని అవలీలగా అధిష్టించి - మనసావాచా తనను తాను మరకతం గారి సేవలకే అర్పించుకున్న వాడాయెను!

* * *

యస్సై మర్రెడ్డిదంతా వూరికే మధనపడే రకం! మదనతాపం అంటే ముచ్చట పడతాడు. కోపతాపాలంటే మోజు పడతాడు. ప్రమోషను కోసం కిందా మీదా పడతాడు. అది అందీ అందకుండా పోయినపుడు అందుబాటులోని పోలీసు బలగం మీద మండిపడతాడు. పై అధికారి ఆజ్ఞలను శిరసావహించడానికి మహా ముచ్చట పడతాడు. ఆయనగారి హయాంలో ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేక పాట్లు పడిపోతున్నారు.

ప్ర-మో-షను. ఈ నాలుగు అక్షరాలతోనే 'జీవితం' మూడక్షరాలు ముడిపడున్నాయి. ఎట్లా? అట్లా... ఆలోచించీ.. ఏదో ఒక 'ఎన్‌కౌంటరు' పథకం పన్నితే అది కాస్తా 'ఎదురుకాల్పు'ల్దాకా దిగిపోయి టోపీ ఊడేదాకా కూడా వచ్చింది.

కూంబింగ్ ఇన్ఫర్మేషన్‌తో ఆ తెల్లవారుఝామున మసకలో... చలిలో మాటేసి చెట్లు... తుప్పల మధ్య నుండి చూసి... భుజం మీద తుపాకులతో తక్కుతూ తారుతూ పోతున్న దళంలోని ఒకడ్ని ఆ మసక చీకట్లో టార్గెటు చేసి మీట నొక్కితో తేలిందేమిటి? ఏమిటంటే వాళ్ళు గొర్రెల కాపర్లు... కాడికర్రలు... సద్దిమూటలు.. చలికి గొంగళ్ళు... ఎక్కడివక్కడ విసిరిపారేసి వలవల ఏడుపులకూ... పెడబొబ్బలకూ తగులుకోవడంతో మర్రెడ్డి ఠారెత్తిపోయాడు. చచ్చినవాడు యువకుడే! వాడి పడుచు పెళ్ళాం... ముసలి తల్లీ

శోకాల్తో... రోదనలతో రాణా మొత్తం దద్దరిల్లిపోయింది. పై నుండి సెట్లో వెల్లువలా వచ్చి పడుతున్న అధికార్ల బూతులకు మ(ర)రెడ్డి బుర్ర పేలిపోయింది. కాళ్ళా వేళ్ళా పడకుండా బూటూ టోపీల వెంబడి ఆ 'పెదురు కాల్పుల' కథనూ... ఇన్‌ఫార్మర్ కారణాలమా కథలు కథలుగా సీరియల్స్ చేసి ఎలాగోలాగ బయటపడేసరికి మాడుమీద టోపీ మాత్రం మిగిలింది!

కాబట్టి సీనియార్టీ... పిప్పియార్టీలను తొక్కేసి ప్రమోషన్ కోసం మ(ర)రెడ్డి మధ్యన పడిపోతున్నాడు. తపించి పోతున్న తరుణంలో గార్డు కనకయ్య కనకవర్షం లాంటి కబురందించాడు.

"అవతల వన్నె ప్రాణుల వేట జరిగిపోతోంది. అబ్బో... అడివంతా ఖాళీ అయిపోతే ఆనక మిగిలేదేదీ వుండదు. ఆకులు తప్ప! జల్దీ రెయిడింగు చేయకపోతే రైలెళ్ళిపోద్ది - సార్... ఇప్పటికే సగం సాపు చేయటం.. పొయి వెలిగించడం పూర్తయిపోయుంటది. ఉట్టి మీద చట్టీ... నాకిపారేసిన బొక్కలూ దొరికినా దక్కిది చాలు. జల్దీ... మంటలు మండిపోతున్నాయి.... అడవులు ఎండిపోతున్నాయి.

మ(ర)రెడ్డి నిటారైపోయాడు - చాతీ ఉబ్బరించాడు. గార్డు కనకయ్యను మెచ్చుకోలుగా చూశాడు. మీసంమెలేశాడు. 'వన్యప్రాణి సంరక్షణ యాక్టు' - 'ఫారెస్టు మాన్యూలు' 'సేవ్‌దిగ్రీన్' బ్యానరూ... బాబుగారి 'క్లీన్ అండ్ గ్రీన్' స్లోగనూ గుద్దిచ్చి హడావుడిగా ఫైరింగ్ రేంజ్‌లో పటాలాన్ని పురమాయించి పొలోమని జీపెక్కాడు.

జీపు దూసుకుంటూ.. దుమ్మురేగగొట్టుకుంటూ పరుగుతీసింది!

***

పైన ఫ్యాను గిర్రున తిరుగుతోంది. జడ్జి మార్తాండం గారి మెదడు నిండా మొసళ్ళు తోకలు మెలేస్తున్నాయి. ఆ ఉదయం మాటామాటా పెరిగి మరకతం తన తొండం లాంటి చేతుల్తో రెండు చెవుల్నీ... చెంపల్నీ అదిమేసి తనను కుదిపేసిన సీను హారిబుల్! తాను బతికాడూ అంటే దానికి తానెంత మాత్రం బాధ్యుడు కాదు గాక కాదు - అబ్బో!

"యువరానర్... ఈ సకల చరాచర సృష్టి యావత్తూ ఆ పరమేశ్వరుని లీలామానుష స్వరూపుడి... పరమాత్ముడి సృష్టి! సృష్టి పరమ పవిత్రం... అమోఘం..." పి.పి.గారు తన్మయంగా సృష్టీ... వేదాంత రహస్యాలు మొదలేయగా... ప్రారంభ అధ్యాయానికే ఆదిలోనే డిఫెన్సుగారు కఠినంగా బ్రేకు వేశారు.

"యువరానర్... సృష్టీ... రహస్యాల నివేదిక కోసం కాదు... ఆస్తిక-నాస్తిక వాదులకు అవకాశం ఇస్తే అదికాస్తా 'రచ్చ' కిందికి మారే ప్రమాదముంది! అబ్జెక్షన్స్...!"

"నస్టెయిన్డ్! మార్తాండంగారు మహోల్లాసంగా మురిసిపోతున్నాడు. ఉదయం తనను మరకతం పడేసిన సందర్భంలోనూ ఇవే మాటలు వాడినా ప్రయోజనం కలిసిరాలేదు.

"యువరానర్...జంతువులు మానవుని మూలాలనే నా వాదనా బలం కోసం ఈ వివరణకు పూనుకున్నాను. జంతువుల పట్ల కారుణ్యం ప్రదర్శించనవసరం లేదని కౌన్సిలు భావిస్తే అట్లాగే కానీయండి!"

మార్తాండం గారికి 'జంతువులు-కారుణ్యం' అనగానే నవ్వు ముంచుకొచ్చింది. అదే... దాన్ని గురించి కూడా మరకతం నాలుగు బూతు పదాల్ని కూడా ఉదయం వాడింది - అయితే తాను అధాటున పక్కగదిలోని 'మూషికం' ప్లాస్టికు బొమ్మను మరకతం మీదికి విసిరేసి, అవిడ కారుకుని ఎగిరెగిరి గంతులేస్తూ పేలపిండి కాలబడినపుడు అబ్బో... ఎంత కులాసాగా ఆ ప్రమాదం నుండి తాను బయటపడ్డాడని! అందుకే మార్తాండంగారు వంటింట్లో... బెడ్‌రూంలో... డ్రాయింగు రూంలో... అబ్బో... వీలయినన్ని... అనువైన చోట్లలో చిన్నా చితకా ఎలుక బొమ్మల్ని వుంచేయడం అలవాటు చేసుకున్నాడు. అయితే మరకతం వాటిని శోధించి... పని పిల్లలతో మురిక్కాలవల్లోకి గిరాటేయించడం చేస్తుంది. తాను తక్కువ తిన్నాడా? మార్కెట్లో టోకున ఎవడికీ తెలవకుండా డజన్ల కొద్దీ మూషిక మూర్తుల్ని తెచ్చి



బీరువాల్లో పకడ్బందీగా దాచుకుని వీలుపడినప్పుడల్లా వాడుకుంటున్నాడా?

"అరణ్యాల్లో వేట నిషిద్ధం... జీవులు పరస్పర సహజీవనం సాగించడం ప్రకృతి ధర్మం. అసలు జీవులన్నీ పరస్పరాధారితాలే!"

"పులీ మేకా కూడానా?" డిఫెన్సుగారు ఓ జోకు పేల్చేసరికి అందరూ హాయిగా నవ్వుకున్నారు.

"అది ఆహారం యువరానర్... పులి మేకల్ని తింటుంది. మేకలు అడవుల్ని తింటాయి. దుప్పీ... జింకా... నెమళ్ళు... అంతరించిపోతున్నాయి యువరానర్..

"పులులూ... సింహాలు తినిపారేస్తే మనుషులు అంతరించి, మూగజీవాలు అంతులేకుండా పోతాయి యువరానర్".

"అది ప్రకృతి శాసనం... దానికి భిన్నంగా మనిషి మాంసం కోసం పులుల్నీ... జింకల్నీ..."

"అబ్జక్షన్... పులిమాంసం మనిషి తింటున్నాడని ప్రాసిక్యూటరుగారంటున్నారు!"

"నేను చెప్పదలుచుకున్నదేవిటంటే పులే మనిషిని తింటుందని... పులి మనిషిని 'ముద్దు పెట్టుకుంటుందని తమరుగానీ విశ్వసిస్తే మరిక నేనేం చేయలేను!"

మార్తాండంగారికి ఒళ్లు మండిపోయింది. డిఫెన్సులాయరు మీద కాదు. తర్వాత ఇద్దరు లాయర్లూ ముద్దూ ముచ్చట్ల మీదా... పులీ... మేకా... మనిషీ... ఆహారం...అడివి మీద పడి అరగంట అరుచుకున్నారు. చివరికి పులిగోళ్లు... చర్మాలు... కోసం మనిషి పులిని వధిస్తున్నాడే అంశం మీద ఏకాభిప్రాయానికి వచ్చేసరికి వారికి ఆలుపు కూడా వచ్చేసింది.

"మన రాష్ట్రం... దేశంలోనే కాదు... ఆఫ్రికా అడవుల్లో ఖడ్గ మృగాల్ని విపరీతంగా వధిస్తున్నారు - ఎందుకు? ఎందుకు?" ఆయన ప్రశ్నకు కోర్టు హాలంతా విభ్రాంతిపడి చూసింది. ఎందుకో ఎవరికీ అందుపట్టలేదు - పి.పి.గారు విలాసవంతమైన నవ్వు కురిపించాడు. బాగా గొంతు తగ్గించి చాలా డ్రమటిక్‌గా "ఆ ఖడ్గమృగం కొమ్ము పొడిచేసి పాలల్లో కలిపి తాగితే మగాడిలో యవ్వనం విరబూసి విరగదీస్తుందనీ... ఓహో... ప్రాచీన ఆయుర్వేద చికిత్సా విధానం... వైద్యం.. అపూర్వం... ధన్వంతరి వారసులు వాళ్ళు... మగసిరికోసం ఖడ్గ మృగాల విచక్షణారహిత సంహారం..!

కోర్టు హాలంతా కాసేపు హాహాకారం చేసింది. జనం చర్చల్లోకి దిగిపోయారు. జడ్జి మార్తాండంగారు ఆలోచనల్లోకి జారిపోయారు. 'ఇదేదో ఆలోచించదగ్గ అంశం లాగే తోస్తుంది. అప్పరాల్ కొమ్ము... వెధవపొడి... పాలు... దీన్దెబ్బకు మగసిరి వికసించడం... అబ్బో మూషికాలతో మరింకెంతో కాలం మరకతాన్ని మభ్యపెట్టి అదిరించి బెదిరించలేడు. తన సత్తా చూపించే రోజు రావాలి! రావాలంటే ముందు వీడ్ని మచ్చిక చేసుకుని జరూరుగా ఖడ్గమృగం కొమ్ము పొడి వివరాలను సేకరించాలి.... సాధించాలి... ఓహో...

ఆనాటికి కోర్టును అర్జంటుగా మార్తాండంగారు వాయిదా వేసి, యమ అర్జంటుగా తన ఛాంబర్‌లోకి పి.పి.ని పిలిపించాడు. ఆయన అణుకువగా అరుదెంచారు.

"ఏమయ్యా పీపీ... అట్లాకూర్చో... అద్సరే... నువ్వు చెప్పిందంతా నిజమేనా?" పి.పి. నోరెళ్ళబెట్టి తడుముకున్నాడు. "అదేంటి సార్... భలేవారే... "లాయర్లు వాగేదంతా నిజమా?" అని మీరడగడం... భలే జోకు వేశారు సార్!"

మార్తాండం ఒళ్ళు మండిపోయినా నిగ్రహించుకున్నాడు - "అది కాదయ్యా- నీ 'వాదన' సంగతి కాదు. అదే... అదేదో ఆఫ్రికా... లాటిన్... పొడీ... పాలూ... వాటి విషయం నేనడిగేది!"

"ఓహో... మాగజైన్లో ఏదో చదివి వాగాను... వాదన కోసం... అది వాడిన వాడ్ని నేను చూడలేదు... నేనువాడలేదు... అమ్మతోడు... అంతే!" పి.పి. నోరెళ్ళబెట్టాడు.

మార్తాండంగారు పుడుక్కున్నాడు - వీడో తలతిక్క మనిషి!

"ఎందుకుసార్! మీకు కొమ్ము కావాలా?" పి.పి. లాలూచీగా అడిగాడు - మార్తాండంగారు మరింక భరించలేక 'గెటౌట్' అని అరిచాడు!

(ఇంకా ఉంది)

ఆర్తిని నింపుకున్న 'తెమ్మెర'



తెమ్మెర కథాసంకలనం
సంపాదకుడు : డా॥ టి.శ్రీరంగస్వామి;
వెల : రు.60/–;
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; నవోదయ బుక్ హౌస్,హైదరాబాద్; శ్రీలేఖసాహితి, హెచ్.నెం.5-11-481, విద్యారణ్యపురి, హన్మకొండ, వరంగల్

ఈ సంకలనంలో మొత్తం కథలు మూడు పదులు దాటాయి. ఈ కథా రచయితల్లో ఇప్పటికే సాహిత్య లోకానికి పరిచయమైన కొందరుంటే, మరికొందరేమో ఈ సంకలనంతోనే సాహితీ లోకానికి పరిచయం అయ్యారని సంస్థ అధ్యక్షుని మాటల్లోనే తెలుస్తుంది.

ఈ సంకలనంలోని పరిచయ వాక్యాల్లో సంస్థ అధ్యక్షులు "హృదయ శల్యం" కథ, తొలికథ 'దిద్దుబాటు' వచ్చిన వయసులోనే రాసిందనీ, కాకపోతే పత్రికల్లో ఆలస్యంగా ముద్రించారని చెప్పుకున్నారు. ఈ కథా రచయిత 'తెలంగాణా' ప్రాంతానికి చెందిన 'మాడపాటి హనుమంతరావు' గారి గురించి రాశారు. ఇలాంటి అంశాలు (చరిత్ర అడుగునున్నవి) ఇప్పుడిప్పుడే చర్చకు వస్తున్నవి. (తొలి) ఆదికవి నన్నయ్య కాదనీ, అతనో స్వేచ్ఛా అనువాదాన్ని చేశాడనీ, ఇంకా ఇతరత్రా ఈ మధ్య చర్చకు రావడం ఆనందించవలసిన విషయమే. అలాగే చరిత్రలో 'తెలంగాణా' సాహిత్యానికి జరిగిన అన్యాయం ఏదైనా ఉంటే అడిగే హక్కును గానీ, అగాధాన్ని పూడ్చుకునే అవకాశాన్నిగానీ ఇవ్వాల్సిందే కదా!

ఈ కథల్లో బలమైనవి శిల్పరీత్యా ఉన్నతమైన స్థాయికి చేరుకున్నవి చాలా ఉన్నాయి. "బ్రతక నేర్వని వాడు, అయినా బ్రతుకుబండిని లాగుతున్నాడు" అని సైకిల్‌షాపు గుమాస్తా భూమయ్య గురించి చెప్పినా, "ఇంతకూ నేనెలా నటించానండీ?" అని తన భర్తను కనకదుర్గ (దయ్యం కథలో) అడిగినా పాఠకుల్ని ప్రశ్నిస్తున్నట్లుంటుంది. రచయితలు వేరైనా, వస్తువులు వేరైనా, కథా వాతావరణం, చుట్టూరా కన్పించే మనుషులు అన్ని కథల్లోనూ సామ్యంగా కన్పిస్తుంది మనకు.

శ్రీధరాచార్య 'తాళిబొట్టు' కథనం అత్యున్నతంగా నడిపించారు. ఈనాటి స్త్రీ, పురుష సంబంధాల్ని (కృతిమ సంబంధాల్ని) వస్తువుగా తీసుకొని చివరికంటా 'టెంపో' నిలబెట్టారు. కథలో చక్రవర్తి ఓ మధ్యతరగతి పురుషుడు. గీత అనే స్త్రీని పెళ్ళి చేసుకొని కొంతకాలం తరువాత నిర్లక్ష్యం చేయడం, ఇంటికి రాకుండా సంవత్సరకాలం పాటు బయటనే గడుపుతాడు. ఈ కాలంలో గీత ఎంతో మనోధైర్యంగా ఉంటూ, జీవితాన్ని జయించడం నేర్చుకొనే పరిస్థితుల్ని కల్పించి, చివరికి తాళిబొట్టు సెంటిమెంట్‌తో తిరిగి రావడానికి ప్రయత్నిస్తే ఆ తాలిబొట్టు కల్పించిన హక్కును అతనికే ఇచ్చేంత దృఢత్వాన్ని నింపుకుంది.

సమాజంలో స్త్రీని 'తాళి', పతియే ప్రత్యక్ష దైవం వంటి సెంటిమెంట్స్‌తో కట్టిపడేసే సంప్రదాయాల్ని తెంచుకోవాలి. స్త్రీ తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలని సూచిస్తాడు ఈ రచయిత. 'సౌందర్య' కథలో రచయిత మొదట్నుంచీ కథా గమనాన్ని మంచి దృక్పథంతో నడిపి సంతాన ప్రాప్తికి పనికి రాదనే పేరుతో నాయక, నాయికల మధ్య పెరిగిన ప్రేమను తుంచడం పదేళ్లు వెనక్కు నడిపించేదిగా ఉంది. 'గాజులు' కథ స్త్రీ తన కార్యనిర్వహణలో పురుషునికి ధీటుగా నిలబడే అనివార్యతను తెలుపుతుంది. తమకు ఆపద వచ్చినప్పుడు (పురుషుల నుండి) ఆత్మరక్షణ కోసం ఆలోచించక మరో పురుషున్ని రక్షించమని కోరడంలో అర్థవంతం లేదని, తన అలంకరణ వస్తువుల్నే ఆయుధాలుగా మలుచుకోవాలని చెప్పడంలో నేర్పు, నైపుణ్యం, వాస్తవాన్ని ప్రతిబింబించేట్లు చెప్పగలిగారు రచయిత్రి అనిశెట్టి రజిత. అభివృద్ధి పేరుతో, పేదల నివాసాల్ని, వాళ్ళ బతుకుల్ని ఛిద్రం చేస్తున్న తీరును 'గూళ్ళు కదిలిపోతున్నాయి' అనే కథలో అనిల్ ప్రసాద్ హృద్యంగా చెప్పాడు. అంతరించి పోతున్న మానవీయ సంబంధాల్ని, నానాటికీ పెరిగిపోతున్న ఆర్థిక బంధాల్లోని అపనమ్మకాన్ని, స్త్రీలపై జరుగుతున్న ఎన్నో అమానవీయ సంఘటనల్ని ఈ సంకలనంలోని రచయితలు, రచయిత్రులు కథా వస్తువులుగా తీసుకోవడంలో ఎంతో ఉన్నతిని సాధించారు.

ఇంత చక్కగా ఎన్నో విలువల్ని మూటగట్టిన కథలను సంకలన పర్చిన ఈ సంస్థ కొన్ని చిన్నచిన్న పొరపాట్లను (కథలుగా భావించలేని వాటిని చేర్చడం వంటివి) చేసినప్పటికీ, అందర్నీ ఒక వేదిక మీదకు చేర్చి తెలంగాణా వాణిని గుట్టిగా విన్పించగలిగింది. ఇంతటితో ఆగకుండా అట్టడుగున పడిన నిజమైన సాహిత్యాన్ని వెలికి తీసే దిశగా ఈ సంస్థ ఎదుగుతుందని ఆశిద్దాం.

* **వేము**

స్వీకారం



అక్షరాలు
రచన : శ్రీనివాస గాంధీ. వెల : రు.30/–,
ప్రతులకు : శ్రీనివాసగాంధీ, సబ్ ఎడిటర్, అక్షర కృష్ణ, కలెక్టరేట్ కాంపౌండ్.

మల్లి(జో)క్స్
వెల : రు.40/–, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

కన్నీరు పగబడుతుంది
(యుద్ధ నిరసన కవితా ఖండిక)
రచన : సత్రీ, వెల : అమూల్యం
ప్రతులకు : అద్భుత, 24-3-43, రామానగర్, విజయవాడ.

తెలుగువారి సొత్తయిన 'పద్య రాగ' ప్రక్రియను జగద్విదితం చేసిన బహుకొద్ది మంది కళాకారుల్లో ఎ.కోటేశ్వరరావు ఒకరు. సంప్రదాయ పౌరాణిక నాటక వైభవానికి వన్నెతెచ్చిన సీనియర్ నటులు ఎ.వి.సుబ్బారావు కుమారులైన ఎ. కోటేశ్వరరావు స్వరాన్ని వినని రంగస్థల కళాభిమానులు లేరంటే అతిశయోక్తి కాదేమో? తండ్రినుంచి నటనా వారసత్వాన్ని అందిపుచ్చుకొని నాటకరంగంలో వృత్తి కళాకారుడిగా ఎదిగిన ఎ.కోటేశ్వరరావు కలియుగ 'కృష్ణుని'గా ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు. హార్మోనిస్ట్‌గా రంగస్థలంపై కాలుమోపి అనంతరం నారదుడిగా, బిల్వమంగళుడిగా, శ్రీకృష్ణునిగా, రామునిగా ..ఇలా ఎన్నో పాత్రల ద్వారా పాతికేళ్లుగా నాటకప్రియుల్ని అలరిస్తున్నారు. సుమారు 1500లకు పైగా ప్రదర్శనలను పూర్తి చేసుకొని వందలాది సత్కారాలు, పురస్కారాలు తన సొంతం చేసుకున్న రంగస్థల గానగంధర్వ ఎ.కోటేశ్వరరావుతో ప్రజాశక్తి సాంస్కృతిక విలేకరి గంగాధర్ వీర్ల జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు.

పద్యనాటకంలో సాంకేతిక మార్పులు అవసరమే

ఎ.కోటేశ్వరరావు

◆ టీవీ, సినిమాల ప్రభావంతవో పౌరాణిక నాటకాలు వెనుకపడ్డాయని అనడం సబబేనా?

మొన్నమొన్నటి వరకూ సంప్రదాయ పౌరాణిక నాటకాలకు ప్రజలు హారతులు పట్టేవారు. సినిమాలున్నప్పటికీ నాటకాలను కూడా ప్రజలు ఆదరించేవారు. అయితే టీవీల విజృంభణతో తీరిక సమయాన్ని టీవీలకే కేటాయిస్తున్నారు. అలాగే కాలాన్ని బట్టి వినోద ప్రక్రియకూడా మారుతుంది. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ప్రజల్లో కనబడుతుంది. ఈ నేపథ్యంలో నాటకరంగం కాస్త వెనుకపడిన మాట వాస్తవమే

◆ అంటే నాటకంపై ప్రజల ఆదరణ తగ్గుతుందనేగా మీ అభిప్రాయం?

కాదు. నాటకంపై ఇప్పటికీ ప్రజలు మక్కువతోనే ఉన్నారు. అయితే కాలం మారింది. నాటకాన్ని ఆర్థికంగా ఆదరించే 'జనులు' కరువయ్యారు. నాటకాలను విస్తారంగా ప్రదర్శించగలిగే సమాజాలు, పరిస్థితులు కరువయ్యాయి.

◆ కారణం?

గతంలో నాటకాన్ని వైభవంగా ప్రదర్శించడానికి పోషకులు ముందుకొచ్చేవారు. పండుగలు, ఉత్సవాలకు భారీ వ్యయంతో, రాష్ట్రవ్యాపిత కళాకారుల సమ్మేళనంతో నాటకాన్ని రూపొందించి ప్రజల ముందుకు తీసుకొచ్చేవారు. ప్రజలు టిక్కెట్టుకొని నాటకాన్ని చూసేవారు. ఇప్పడా పరిస్థితి దాదాపు లేదనే చెప్పాలి. నాటకాల స్థానంలో 'డాన్స్‌బేబి డాన్స్' లాంటి జనాకర్షణ కార్యక్రమాలతో సరిపెట్టుకుంటున్నారు.

◆ సంప్రదాయ నాటకానికి సాంకేతిక మార్పులు జోడించడం ఎంతవరకు అవసరం?

మారుతున్న ట్రెండ్‌ను అనుసరించి గుణాత్మక విలువలు పాడుచేయకుండా సంప్రదాయ నాటకాల్లో సాంకేతిక మార్పులు చేసుకోవచ్చు. లైటింగ్ ఎఫెక్ట్స్ నుంచి రంగాలంకరణ వరకూ ఓపిక మేరకు సెట్టింగులు ఏర్పాటు చేసుకుంటే నేటితరాన్ని కూడా నాటకాలు దగ్గరవుతాయి.

◆ పద్యనాటకాల్లో సుదీర్ఘరాగాలాపనను కొంతమంది వ్యతిరేకిస్తున్నారు కదా? దానిపై మీ అభిప్రాయం?

శృతి మేళవించి రాగయుక్తంగా పాడిన పద్యరాగాన్నే ప్రేక్షకులు కోరుకుంటారన్నది వాస్తవం. ఇప్పటికీ పల్లెప్రాంతాల్లో పాడిన రాగాన్నే పదే పదే పాడమని ప్రేక్షకులు అడుగుతుంటారు. పద్యరాగం పౌరాణిక నాటకానికి అలంకారం కనుక సమయాన్ని, గాత్ర ధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని పద్యం పాడితేనే పద్యరాగానికి ప్రేక్షకులు ఆదరిస్తారు.

◆ వర్ధమాన కళాకారులకు మీరిచ్చే సూచన?

పౌరాణిక నాటకమంటేనే భారీ వ్యయం, భారీ నిర్మాణంతో కూడుకున్నది. ప్రపంచ ప్రసిద్ధిచెందిన నాటకం మరింతగా వికసించాలంటే ముఖ్యంగా కళాకారులంతా ఏకం కావాలి. గురుశిక్షణ అలవర్చుకోవాలి. సమీక్షలు, వర్క్‌షాప్‌లు నిర్వహించుకోవాలి. అలాగే ముఖ్య పట్టణాల్లో రంగస్థల

ప్రదర్శనలకు అనువుగా ఉండే ఆడిటోరియాలు ప్రభుత్వం నిర్మిస్తే.. సాంకేతిక పరమైన అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

◆ 'నంది' ఉత్సవాలపై మీ కామెంట్?

నంది ఉత్సవాలు నాటకరంగానికి కొత్త ఉత్సాహాన్ని నింపుతున్న మాట వాస్తవమే. అయితే నంది ఎన్నిక ప్రక్రియలో స్వచ్ఛత, ప్రమాణాల స్థాయి పెరగాలి ◆

ఆసుపత్రి వాతావరణం ప్రశాంతంగా ఉంది.

తెల్లబట్టల్లో నర్సులు... వైద్యులు హడావుడిగా తిరుగుతున్నారు. రోగులను చూడటానికి వచ్చిన బంధువులు, ఆత్మీయుల మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

చిల్ల ఎర్రయ్యరెడ్డి తలతిప్పి చూశాడు.

అంగవైకల్యం అడ్డుకాదు

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

శరీరం మత్తుగా ఉంది. కదలడానికి అవకాశం లేని విధంగా మంచానికి కట్టివేసినట్లు అనిపిస్తోంది. పక్కకు తిరగాలని అనుకున్నాడు. నడుం వద్ద కలుక్కుమంది. ఆ ప్రయత్నాన్ని విరమించాడు.

దూరంగా ఉన్న డ్యూటీలో డాక్టర్ అతని దగ్గరకు వచ్చాడు.

"మీరు విశ్రాంతి తీసుకోవాలి. కళ్ళు మూసుకోండి.." ఇంగ్లీషులో అనునయిస్తూ చెప్పాడు.

"ఏమైంది.. డాక్టర్ నాకేమైంది..?" ప్రశ్నించాడు.

డాక్టర్ సన్నగా నవ్వాడు "ఏం కాలేదు. బాగున్నారు కదా?" అంటూ నర్సు వైపు తిరిగి "రెడ్డిగారికి ఇంజక్షన్ చెయ్యి" పురమాయించారు. తర్వాత నెమ్మదిగా వార్డులో నుండి బయలుదేరారు.

ఎర్రయ్య రెడ్డి నిస్త్రాణంగా తల వాల్చేశాడు.

గత దినం జరిగిన సంఘటన కళ్ళ ముందు మెదిలింది.

అస్సాం ఆర్మీ సప్లయ్ కోర్‌గా విధి నిర్వహణ చేస్తున్నాడు. నాలుగు అంతస్తుల భవనం చివరలో తను నిల్చున్నాడు. కింది నుంచి ఎవరో పిలిచారు.... తను వెనక్కి అడుగు వేశాడు. పిట్టగోడ కూలిపోయి మీద నుంచి కిందికి జారిపోయాడు.

దబాలున కింద పడటం గుర్తుంది..

ఆ తర్వాత కళ్ళు బైర్లు కమ్మాయి. మరేమీ తెలియదు. ఎర్రయ్యరెడ్డిలో ఆలోచనలు మొదలయ్యాయి.

ఇంతకీ తనకు ఏమైంది?

'కాళ్ళూ, చేతులూ విరిగిపోయాయా? అవయవాలను తొలగించారా' తల తిప్పి

చూసుకోవడానికి కూడా అవకాశం లేకపోయింది.

సిరంజీలో మందు ఎక్కించి నర్సు దగ్గరికి వచ్చింది. చేతికి ఇంజక్షన్ ఇచ్చింది.

శరీరంలో మత్తు కమ్ముకుంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. క్రమక్రమంగా ఎర్రయ్యరెడ్డి నిద్రలోకి జారుకున్నాడు.

ఆ రోజు 1997 మే 26వ తేదీ.

* * *

ఎండలు మండిపోతుండటంతో రక్షణ శాఖ ఆసుపత్రిలో సిబ్బంది ఎయిర్ కండీషనర్ ఆన్ చేశారు.

విశాఖపట్నం జిల్లా భీముని పట్నం మండలం రేఖవానిపాలెం పంచాయతీ మరడపాలెం గ్రామానికి చెందిన 35 సంవత్సరాల చిల్ల ఎర్రయ్య రెడ్డికి చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఎంతో ఇష్టం. చిట్టివలస జిల్లా పరిషత్ హైస్కూలులో కొంతకాలం విద్యాభ్యాసం చేశారు.

జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ వంటి క్రీడలను అనునిత్యం ప్రాక్టీస్ చేస్తూ ఎంతో తర్ఫీదు పొందారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిల్లో ఎన్నో బహుమతులను, అవార్డులను పొందారు. ఆ ప్రతిభతో 1989లో సైనిక దళానికి ఎంపికై దేశ రక్షణలో పని చేశారు. అస్సాం రెజిమెంటల్ ఆర్మీ సప్లయ్ కోర్‌గా ఉద్యోగాన్ని పొందారు.

1997 మే 25న రెజిమెంట్ ఇన్‌స్పెక్షన్ చేయడానికి రక్షణ శాఖ అధికారులు విచ్చేశారు. ఆ సమయంలో భవనం పై అంతస్తులో పని చేస్తున్న ఎర్రయ్యరెడ్డి అమాంతం జారి కింద పడిపోయాడు. దీంతో వెన్నెముక విరిగిపోయింది. ఆయన కదలలేని స్థితిలో పడిపోయారు.

* * *

ఆ రోజు 2001 జూన్ 10వ తేదీ

"మిస్టర్ రెడ్డీ! అనుకోకుండా జరిగిన ప్రమాదంలో నీ నడుము విరిగిపోయింది.." కాస్త కోలుకున్న తర్వాత డాక్టర్లు చెప్పారు.

వీల్ చైర్‌లో కూర్చునే పరిస్థితి వచ్చేసరికి అధికారులు రక్షణ ఆసుపత్రికి వచ్చారు– "మీరు ఈ ఉద్యోగం చేయలేరు. స్వచ్ఛంద పదవీ విరమణ చేయండి!" అంటూ కొన్ని కాగితాలు అందించారు.

ఎర్రయ్య రెడ్డి కళ్ళు వర్షించాయి.

ఆ కాగితాల మీద సంతకాలు చేసి తన ఆమోదాన్ని తెలియజేశారు.

కాగితాలు తీసుకుని అధికారులు వెళ్ళిపోయారు.

ఆ రోజుతో అస్సాంతో రుణం తీరిపోయింది.

* * *

ముంబయి మహానగరం.

మహారాష్ట్ర పేరా ప్లేజిక్ రిహాబిలిటేషన్ సెంటర్.

ఎర్రయ్యరెడ్డికి ఉపాధి లభించింది.

నిలబడలేని అతని పరిస్థితిని, విధి నిర్వహణలో జరిగిన అన్యాయాన్ని గుర్తించి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాన్ని కల్పించింది. కూర్చుని చేసుకునే ఉద్యోగం ద్వారా తన పూర్వ జీవితానికి అలవాటు పడ్డాడు.

సాధారణ జీవితాన్ని గడిపేసినట్లయితే వారి గురించి ఎవరూ పట్టించుకోరు.

ఎవరో ఏ స్ఫూర్తి ప్రదాతో పరిచయం అయితే మొత్తం పరిస్థితే మారిపోతుంది.

ఆ విధంగా పరిచయమయ్యారు కల్నల్ జోషి.

"మిస్టర్ ఎర్రయ్యరెడ్డీ! నీలో మంచి క్రీడాకారుడు ఉన్నాడు. నువ్వు నిలబడలేకపోవచ్చు. కానీ నీ చేతుల్లో శక్తి ఉంది. దానికి పదును పెట్టు. మనుషుల్లో విలక్షణ వ్యక్తిగా రూపొందు!" సలహా ఇచ్చాడు.

జోషి మాటలు ఎర్రయ్యరెడ్డిలో కదలికలు తెచ్చాయి.

ఆత్మవిశ్వాసం... పట్టుదల పెంచుకున్నాడు.

ఎలాగైనా ఆడాలి. తన ఆటల ద్వారా అందరిలోనూ గుర్తింపు పొందాలి... అనుకున్నాడు.

అప్పటి నుంచి నిరంతర కృషి... ప్రాక్టీసు మొదలు పెట్టాడు. గెలుపే ధ్యేయంగా కృషి చేశాడు.

* * *

ముందుగా మహారాష్ట్రలో రాష్ట్ర స్థాయిలో పూనాలో జరిగిన పోటీల్లో చిల్ల ఎర్రయ్యరెడ్డి విన్నర్‌గా నిలిచారు. జాతీయ స్థాయిలో 2002 జనవరిలో జరిగిన పోటీలో కూడా విన్నర్‌గా వచ్చారు. బుసాన్‌లో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలో కేరళ నుంచి ఇద్దరు, మహారాష్ట్ర, ఉత్తరాంచల్, నేపాల్ నుంచి ఒక్కొక్కరు పోటీకి వెళ్ళారు. ఆంధ్రప్రదేశ్ నుంచి చిల్ల ఎర్రయ్యరెడ్డి (భీమునిపట్నం) కె.ఎన్.రెడ్డి (మహబూబ్‌నగర్), ఎ.శ్యామలరాజు (నెల్లూరు) అనే క్రీడాకారుల బృందం పాల్గొంది.

బుసాన్‌లో జరిగిన పోటీలో ఎర్రయ్య రెడ్డి జావలిన్‌త్రోలో కాంస్య పతకం పొందారు.

ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి క్రీడాకారుల్ని 2002 నవంబర్ 22న కలిశారు. నడుం విరిగిపోయి నడవలేని స్థితిలో ఉన్న రెడ్డిని చక్రాల కుర్చీలో ప్రధాని కార్యాలయానికి తీసుకువచ్చారు. ఆయనను ప్రధానమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. బుసాన్‌లో జరిగిన పోటీల్లో విజేతలైన వారికి ప్రథమ స్థానానికి రు.5 లక్షలు, ద్వితీయ స్థానానికి రు.3 లక్షలు, తృతీయ స్థానానికి రు.2 లక్షలు ఇస్తామని ప్రధాని వారికి హామీ ఇచ్చారు.

* * *

మరడపాలెం.

ఎర్రయ్యరెడ్డి ఇల్లు ప్రశాంతంగా ఉంది.

ప్రధానమంత్రి అభినందనలు గొప్ప స్ఫూర్తిని కలిగించాయి. ఇంకా ఇంకా విజయాలను సాధించాలని ఉత్సాహపరిచాయి.

ఆత్మవిశ్వాసం గొప్ప తృప్తిని కలిగించింది.

ఎంతోమంది అభినందనలు... ప్రశంసలు ఆనందాన్ని కలిగిస్తున్నాయి.

తను కదలలేని స్థితిలో ఉన్నప్పుడు వెన్నుతట్టి లేపిన కల్నల్ జోషి తనకు ఎప్పుడూ గుర్తు కొస్తుంటారని రెడ్డి తెలిపారు.

గోడకు జోషి ఫొటో తగిలించారు.

ఇంటికి వచ్చి అభినందించి షేక్‌హాండ్ ఇచ్చి వెళ్ళే వారిని సాగనంపుతూ ఎర్రయ్యరెడ్డి ఎదురుగా ఉన్న గోడవైపు చూస్తుంటారు.

గోడమీద ఫొటోలో జోషి ఉత్సాహంగా ఉరకలెయ్యి అని ప్రోత్సహిస్తున్నట్లే అనిపిస్తుంటారు. ◆

కొండపల్లి బొమ్మ

✻ కొండబాబు

ఫలానా బ్యాంకు శఠగోపం' పేపర్లోని శీర్షికను పెద్దగా చదివాడు యాదగిరి. "రోజూ ఏదొక బ్యాంకు బోర్డు తిప్పేయడం సహజమైపోయింది... ప్చ్..." నిట్టూర్చాడు సింహాద్రి.

యాదగిరి, సింహాద్రి ఒకే కాంపౌండ్‌లో ఉంటారు. వాళ్ల ఇళ్ల మధ్య గల చెట్టు కింద రోజూ ఉదయం పేపర్లు ముందేసుకుని కూర్చుని మాట్లాడుకోవడం అలవాటు.. మధ్య మధ్య కాఫీ చప్పరిస్తూ.

"దేశంలో రోజురోజుకూ కుంభకోణాలు పెరిగిపోయాయి" అన్నాడు యాదగిరి.

"అవునవును.. ప్రజలను కొన్ని బలహీనతలకు బానిసలుగా చేయడం, వాటిపై ఆడుకోవడం ఈ తరహా మోసాలకు కారణం" సింహాద్రి.

"అవును విజయవాడలో ఇరవై ఏళ్ల క్రితం 'సప్తగిరి' అనే సంస్థ ఇలా మోసం చేసినప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు.. ఆ తర్వాత ఏది జరిగినా..'మరో సప్తగిరి'.., 'ఇంకో సప్తగిరి' అంటూ పేపరోళ్ళు హెడ్డింగులు పెట్టేవాళ్లు. ఇప్పుడు సహజమైపోయి ఆ తరహా శీర్షికలకు కాలం చెల్లింది."

"ప్రజలు ప్రశ్నించితే తప్ప ఇలాంటివి ఆగవు".

"అవును... ప్రజాపోరాటాలంటే పెద్దగా పట్టని మధ్య తరగతి ప్రజలు కూడా ఇలాంటి మోసాలపై ఇప్పుడు రోడ్డెక్కి మాట్లాడుతున్నారు. మంచి పరిణామమే"

* * *

కుంభకోణాలు నేడు సాధారణమై పోయిన మాట నిజమే కానీ, అసలు 'కుంభకోణ' మంటే ఏమిటి? ఎలా ఈ పదం వచ్చింది? అనేది ఆసక్తికరమే.

'కుంభకోణం' అనేది గడచిన శతాబ్దంలో పుట్టిన జాతీయం. జాతీయాలు కొత్తగా కూడా ఏర్పడతాయా? అనే సందేహం రావచ్చు. ఆయా కాలాల్లోని వ్యవహార పరిణామాల మూలంగా కొన్ని జాతీయాలు ఎప్పుడూ పుడుతూనే ఉంటాయి. అలాంటి కొన్ని ఆధునిక జాతీయాల గురించి తెలుసుకుందాం.

'కుంభకోణం' అంటే మనకు ప్రస్తుతం తెలిసివున్న అర్థం 'మాయ' గా జరిగే మోసమని. ఈ పదానికి ఈ అర్థం ఎలా ఏర్పడిందనే దానికి ఆసక్తికరమైన ఆధారాన్ని చెప్తుంటారు. మన పొరుగునున్న తమిళనాడు రాష్ట్రంలో కుంభకోణం అనే ఊరుంది. కుంభకోణం మాకు తెలియదా? ప్రసిద్ధ పుణ్యక్షేత్రంకదా"! అనంటారా? ఆ ఊరే ఇది.

ఆ ఊరిలోని ప్రఖ్యాత గుడిలో దేవుడు వాయులింగంగా ఉంటాడట! అర్థం కాలేదా? వాయు రూపంలో. అదీ సంగతి... అదీ మాయ.. అదే.. "కుంభకోణం" అంటారు మరి! 'మాయగా ఉండే రూపాన్ని 'కుంభకోణం'గా సంబోధించడంతో పాటు 'మాయ'గా జరిగిన ప్రక్రియనూ అలాగే అనడం పరిపాటయింది. ఇది ప్రధానంగా పత్రికల ద్వారానే జనవ్యాప్తిలోకొచ్చింది. ఈ జాతీయం క్రియగానూ స్థిరపడడం విశేషం.

ఇలాంటివే మరికొన్ని. 'కోయంబత్తూరు నోట్లు' అనడం వినే ఉంటారు. అంటే నకిలీనోట్లని. 'కోయంబత్తూరు కూడా తమిళనాడులోని ఒక ఊరుపేరే. ఒకప్పుడు కోయంబత్తూరులో దొంగ నోట్ల ముద్రణ జరిగేదట. అందుకే అలా వాడుకలోకొచ్చింది. అయితే ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ ఈ 'ముద్రణ' జరుగుతుండటంతో దీని వాడుక తగ్గింది. పేలనితుపాకులను 'శివకాశి తుపాకులు' అంటుంటాం. 'తమిళనాడులోని శివకాశి దీపావళి మందుగుండు సామగ్రి తయారీకి పేర్గాంచిన ఊరు. ఆ రీత్యా పుట్టిన పలుకుబడి ఇది. ఇలా ఊళ్ల పేర్ల కింద పుట్టిన జాతీయాలూ మనకు ఎక్కువే.

'కొండపల్లి బొమ్మ' అనే పలుకుబడిని అందమైన వారినుద్దేశించి అంటారు.. ప్రధానంగా అమ్మాయిల్ని. విజయవాడ శివారులోని కొండపల్లిలో పొణుగు కొయ్యతో బొమ్మల్ని తయారు చేస్తారు. ఇవి చాలా అందంగా ఉంటాయి. వాటి నుంచే ఈ పలుకుబడి పుట్టింది. అలాగే మరికొన్ని పలుకుబడులు ఊళ్ల గుణగణాలను ఆధారం చేసుకుని పుట్టినవే. 'చిలకలపూడి బంగారం' అనే మాట వినే ఉంటారు. అంటే నకిలీ బంగారమనేది జనానికి తెల్సిన అర్థం. అయితే వాస్తవం దీనికి అంత దగ్గరగా ఉండదు. చిలకలపూడి అనేది మన బందరు(మచిలీపట్నం)లోని ఒక ప్రాంతం పేరు. అక్కడ వెండితో ఆభరణాల తయారుచేసి, దానికి బంగారం ఊదేవారు. ఇవి పేద, మధ్యతరగతి వారికి అందుబాటులో ఉండేవి. వెండి తయారీ, బంగారం పూత కాబట్టి పూర్తి బంగారంలా అనిపించేవి. మన్నిక బాగుండేది. అయితే ఈ నాణ్యతను ఆధారం చేసుకుని... వీటిని కొని 'పూర్తి బంగారు ఆభరణాలు' పేరుతో కొందరు మారు అమ్మకం చేస్తూ మోసగించేవారట. అందువల్ల ఏది పూర్తి బంగారమో, ఏది చిలకలపూడి బంగారమో తెలిసేది కాదు. అప్పటి నుంచి ఇలాంటి మోసగాళ్ల మూలంగా నకిలీదానిని దేనినైనా 'చిలకలపూడి బంగారం' అనడం కద్దు. పూర్తిగా నిజం బంగారం అనిపించేలా నగలు తయారు చేసే చిలకలపూడిలోని ఆ వృత్తి కళాకారులు ఇప్పుడు దయనీయ స్థితిలో ఉన్నారు.

మంచి తీయని పదార్థాన్ని 'బందరు మిఠాయి' లాగుంది అంటారు. బందరు మిఠాయి అంటే అక్కడ దొరికే తొక్కుడు లడ్డూ పేరు. ఇది ఎంతగా ప్రశస్తమంటే తెలుగు మాట్లాడే ప్రజలుండే దేశంలోని ఏ పట్టణంలోనైనా ఈ పేరుతో 'స్వీటుషాపు' కచ్చితంగా ఉంటుంది. అయితే ఈ 'బందరు మిఠాయి' తయారీకి ఇప్పుడు బందరు మాత్రమే కేంద్రం కాదు. అదే ఫార్ములాతో లేదా దాన్ని కాస్త అటూ ఇటూ మార్చి అనేకచోట్ల తయారు చేస్తున్నారు. ఇలా పుట్టిన మన పలుకుబడులు అనేకం బందరు మిఠాయి అంత తీయనైనవే. ◆

పాఠక స్పందన

మాకూ వెళ్ళాలనిపిస్తోంది

ప్రతీ వారం టూరిస్ట్‌గైడ్ ఎంతో ఇంట్రెస్టింగ్‌గా వుంటోంది. చదువుతున్నంత సేపూ చూస్తున్నట్లుగా అనిపిస్తోంది. రాసిన విధానం బాగుంటోంది. ఫొటోలు కూడా మంచివి వేస్తున్నారు. చదివిన తర్వాత మాకు కూడా ఆ ప్రదేశాలకు వెళ్ళాలనిపిస్తోంది.

– **చక్రవర్తి**, మంగనూరు, మహబూబ్‌నగర్ జిల్లా

రియల్ స్టోరీ బాగుంది

జూన్ 1 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన గోరంత దీపం ఆత్మీయతకు, ఆప్యాయతకు అద్దం పట్టే విధంగా కలిసి పంచుకోవడంలోనే ఉన్నది నిజమైన అనురాగం, అనుబంధం అని ఈ కథ ద్వారా తెలియజేయడం నిజంగా అపూర్వమైన అనుభవంగా తోస్తున్నది.

– **మేడూరి సత్యనారాయణ**, తిరువూరు, కృష్ణాజిల్లా

కథ బాగుంది

జూన్ 1 నంచికలో 'నిర్ణయం' కథా రచయిత్రి అత్తలూరి విజయలక్ష్మి గారికి అభినందనలు! భర్తపోయిన స్త్రీని వికృతం చేసి బాధించే శాడిస్టు సమాజం మనది. 'పురుషుడు' ఒక ఎదురులేని పాలక వ్యవస్థ. కానీ స్త్రీలల్లో విభజనలు, తల్లి, అత్త, ఆడబిడ్డలు, కూతుళ్ళు, కోడళ్ళు, వదిన... వగైరాలు ఎన్నో వేర్వేరు నమూనాలు, పరస్పరం శత్రువులు. సమాజం గతి తప్పకుండా ఉండాలంటే దుష్టసంప్రదాయాల్ని స్త్రీల మీద రుద్దాలి. కథ చదువుతుంటే నా చిన్నప్పటి ఘటన కళ్ళకు కట్టినట్టు కన్పించింది. శాంతి లాంటి వాళ్ళు అతి కొద్ది మంది ఉన్నా, ఉన్మాద లోకుల్ని ఎదుర్కోలేకపోతున్నారు.

– **అనిశెట్టి రజిత**, హన్మకొండ

With best Compliments from

ANAND AGROS (P) LIMITED

Office : S.No. 12,13 & 14, Ground Floor,
Happy Trade Centre, Opp. Clock Tower, 62, S.D. Road, Secunderabad-3

Factory : S.No. 607 & 611, Kondamadugu Village,
Bibinagar - 508126, Nalgonda Dist., A.P.

Phone : Off 27713402, 27718817, Fax : 040-27718817,
Fact : 08685-268383

A. SURI BABU Managing Director

With best compliments from

విష్ణుప్రియా స్టోన్ క్రషర్

మైలారం గ్రా॥, బొమ్మలరామారం మం॥, నల్గొండ జిల్లా.

SGPS

శ్రీ గౌతమి

పబ్లిక్ స్కూల్

L.K.G. to 10th Class

గాంధీపురం - 3, రాజమండ్రి - 3,
ఫోన్స్ : 2463533, 2468971
బ్రాంచ్ : ఇ.ఎస్.ఐ. హాస్పిటల్ ఎదురుగా, శ్రీరామనగర్, రాజమండ్రి,
ఫోన్ : 5568523